Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 323 మేడ్చల్ మల్కాజ్‌గిరి 12 డిసెంబర్ 2023 మంగళవారం పేజీలు : 4

### 'వీసా స్టాంపింగ్' పైలట్ ప్రాజెక్టు జాప్యంతో నైరాశ్యం

వాషింగ్టన్ : హెచ్, ఎల్ కేటగిరీ ఉద్యోగుల వీసాల రెన్యువల్ కోసం దేశీయంగానే(అమెరికాలోనే) స్టాంపింగ్ ప్రక్రియను అనుమతించే పైలట్ కార్యక్రమం ఇంకా కార్యరూపం దాల్చకపోవడంతో అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న వేలాదిమంది భారతీయ నిపుణులు నిరాశ చెందుతున్నారు. అమెరికాలో పనిచేస్తున్న భారతీయ నిపుణుల్లో వేలాదిమంది సెలవుల్లో కుటుంబంతో గడిపి రావాలని ప్రణాళికలు రూపొందించుకున్నారు. స్వదేశంలో కుటుంబసభ్యులతో గడిపిన తర్వాత తిరిగి అమెరికా రావాలంటే ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం, లేదా చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా, ముంబైలలోని అమెరికా కాన్సులేట్‌లలో పాస్‌పోర్టులపై స్టాంపింగ్ వేయించుకోవాల్సి ఉంటుంది. 2004లో దీనిని నిలిపివేశారు. దీంతో స్వదేశంలో పత్రాలపై స్టాంపింగ్ కోసం సుదీర్ఘకాలం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.






# నిరుద్యోగులకు తీపి కబురు..

## ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్ రివ్యూ

హైదరాబాద్: వరుస రివ్యూలతో సెక్రటేరియట్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బిజీబిజీగా ఉన్నారు. సోమవారం నాడు ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్ రివ్యూ చేశారు. పూర్తి వివరాలతో రావాలని టీఎస్పీఎస్సీ అధికారులను సీఎం ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు టీఎస్పీఎస్సీ భర్తీ చేసిన ఉద్యోగాల వివరాలు, నోటిఫికేషన్ల వివరాలతో రావాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రైతు భరోసా పథకంపై కూడా సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. సెక్రటేరియట్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అధికారులు హాజరయ్యారు. సచివాలయంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం అధికారులతో.. ఎక్సైజ్ శాఖ అధికారులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు , ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. **ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష –** హైదరాబాద్‌లోని జలసౌధ కార్యాలయంలో ఉన్న ఇరిగేషన్ శాఖకు సంబంధించిన ఛాంబర్‌కి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెళ్లారు. పూర్ణ కుంభంతో వేదపండితులు మంత్రి ఉత్తమ్‌కి స్వాగతం పలికారు.

అలాగే ఇరిగేషన్ శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఇరిగేషన్ శాఖపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖకు సంబంధించిన పలు కీలక అంశాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్చించినట్లు తెలుస్తోంది.



## సమన్వయంతో పని చేస్తూ సాగు రంగంలో ....

### ఉత్పత్తిని పెంచాలి : మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

హైదరాబాద్ : అన్ని రకాల పంటలకు తెలంగాణ నేల అనుకూలంగా ఉంటుంది. బహుశా దేశంలో ఏ రాష్ట్రానికి ఈ ప్రత్యేకత లేదని, సీజన్ల వారిగా ముందుగానే శాఖల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని, అందుకు తగ్గట్టుగా రైతులను వ్యవసాయానికి సమాయత్తం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరవాత సచివాలయంలోని వ్యవసాయ శాఖ సెక్రటరీ ఛాంబర్లో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మంత్రికి సెక్రటరీ రఘునందన్ రావు, హెచ్ఓడీ, ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి ఉత్పత్తి పెంచి వ్యవసాయశాఖకు మంచి పేరు తేవాలని సూచించారు. వ్యవస్థలో, శాఖాపరంగా ఉన్న లోపాలను సవరించుకొని రైతులకు సంక్షేమానికి అధికారగణం పాటుపడాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అధిక పంట దిగుబడిని సాధించడమే కాకుండా, ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం విశేషంగా కృషి చేయాలన్నారు. తద్వారా రైతులకు మంచి మద్దతు ధర లభించేలా మార్కెటింగ్ శాఖా అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తరకం పంటలను రైతులకు పరిచయం చేయాలి. మామిడి, జామ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఆ పంటల సాగుకు సహాయపడాలి. పాం ఆయిల్ పంట సాగు చేసే రైతులు మంచి దిగుబడి సాధిస్తున్నారు. వాళ్లకు మంచి గిట్టుబాటు ధర లభిస్తున్నది. ఆ సాగును మరింత ప్రోత్సహించాలని, అందులో అంతర పంటగా పుచ్చకాయలుపండించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు.




హైదరాబాద్: భారాస అధ్యక్షుడు, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వీలైనంత త్వరగా కోలుకొని ప్రజా సేవకు రావాలని తెదేపా అధినేత చంద్రబాబు ఆకాంక్షించారు. సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను చంద్రబాబు పరామర్శించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి వెలుపల చంద్రబాబు మాట్లాడుతూ.. కేసీఆర్ త్వరగా కోలుకుంటున్నారని చెప్పారు. " ఆయనతో మాట్లాడాలనిపించి వచ్చాను. కోలుకోవడానికి ఆరువారాల సమయం పడుతుందని వైద్యులు చెప్పారు. వైద్యులు చాలా చక్కగా ఆపరేషన్ చేశారు. త్వరలోనే కేసీఆర్ మామూలుగా నడుస్తారు'' అని చంద్రబాబు అన్నారు. యశోద ఆస్పత్రిలో ఉన్న కేసీఆర్‌ను పలువురు నేతలు పరామర్శిస్తున్నారు. తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. కేసీఆర్‌ను కలిసి మాట్లాడారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స విజయవంతమైందని వైద్యులు తనకు చెప్పినట్లు భట్టి వెల్లడించారు. ఆయన త్వరగా కోలుకుంటున్నారని అన్నారు. మరోవైపు ప్రముఖ సినీనటుడు ప్రకాశ్‌రాజ్, బీఎస్పీ నేత ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ కూడా కేసీఆర్‌ను పరామర్శించి, క్షేమ సమాచారం తెలుసుకున్నారు. గురువారం రాత్రి ఎర్రవల్లి నివాసంలోని బాత్‌రూంలో జారిపడటంతో కేసీఆర్ ఎడమ తుంటికి తీవ్ర గాయమైన సంగతి తెలిసిందే. సోమాజిగూడలోని యశోద ఆస్పత్రి వైద్యులు ఆయనకు శుక్రవారం రాత్రి తుంటి మార్పిడి శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలోనే ఉంటూ కోలుకుంటున్నారు.



## ఆ ఫైళ్ల మాయంపై విచారణ వేగవంతం చేశాం

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రుల కార్యాలయాల్లో ఫైళ్ల మాయంపై విచారణ వేగవంతం చేశామని సెంట్రల్ జోన్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నాడు డీసీపీ తన కార్యాలయంలో మాట్లాడుతూ.. ఈ కేసులో డైరక్టర్‌ను విచారణ చేయాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్లు, ఫర్నిచర్ మిస్సింగ్ పై దర్యాప్తు చేస్తున్నాం. పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఫైల్స్ మిస్సింగ్ చేసినట్లు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్డీ కళ్యాణ్‌పై ఆరోపణలు ఉన్నాయి. కళ్యాణ్‌తో పాటు డైరెక్టర్‌ను విచారణ చేసి, స్టేట్‌మెంట్ రికార్డ్ చేస్తాం. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కార్యాలయాల్లో ఫర్నిచర్ మిస్సింగ్‌పై కూడా కేసు నమోదు చేశాం. అలాగే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కార్యాలయంలో బీర్వాలు మిస్సింగ్‌పై కూడా కేసు నమోదు చేశాం.విద్యా శాఖలో జరిగిన సంఘటన పై దర్యాప్తు జరుగుతుంది. మాజీ మంత్రుల ప్రమేయం ఉంటే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం. విచారణలో ఎవరి ప్రమేయం ఉన్న చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం" అని డీసీపీ హెచ్చరించారు.

# మజ్లిస్ కు ప్రొటెం స్పీకర్ వెనుక కాంగ్రెస్ భారీ వ్యూహం!?

హైదరాబాద్ : వివిధ శాఖల మంత్రులతో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. వారికి కేటాయించిన శాఖలతో మంత్రులు మరింత ఉత్సాహంగా ఉన్నారు. స్పీకర్ గా దళితుడైన గడ్డం ప్రసాద్ కుమార్ ను లాంఛనంగానే ఎన్నుకున్నా.. రేపు ఆయన ప్రమాణ స్వీకారం చేస్తారని తెలుస్తోంది. ప్రొటెం స్పీకర్ గా మజ్లిస్ పార్టీకి చెందిన అక్బరొద్దీన్ ఒవైసీ ఈ రోజు (డిసెంబర్ 09) ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనే మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అయితే, ఈ కార్యక్రమాన్ని బీజేపీ బహిష్కరించింది. ప్రొటెం స్పీకర్ మజ్లిక్ కు ఇవ్వడంపై బీజేపీ తీవ్రంగా ఆక్షేపించింది. **ప్రొటెం స్పీకర్ ఎన్నిక వెనుక కాంగ్రెస్ వ్యూహం..** ఆల్ ఇండియా మజ్లిస్–ఈ–ఇతిహదుల్ ముస్లిమీన్ పేరుతో హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఈ పార్టీకి 90 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. ఎంఐఎం హైదరాబాద్ లో ఓల్డ్ సిటీతో పాటు రాష్ట్రం, దేశంలోనే ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉండే శాసనసభ స్థానాల్లో పోటీ చేస్తుంది. ఇక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2008లో కాంగ్రెస్ నేతృత్వంలోనే యూపీఏ (యునైటెడ్ ప్రోగ్రేసీవ్ అలయన్స్)లో చేరింది. 2012లో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకొని ఏడు అసెంబ్లీ సీట్లను దక్కించుకుంది. ప్రస్తుతం (2023) అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకున్న ఎంఐఎం 9 చోట్ల పోటీ చేయగా.. 7 సీట్లను కైవసం చేసుకుంది. అయితే గతంలో తమ మిత్ర పక్షంగా ఉన్న ఎంఐఎంను మళ్లీ తమ వైపునకు తిప్పుకోవాలని రేవంత్ రెడ్డి భారీగా ప్లాన్ చేసినట్లు టాక్ వినిపిస్తుంది. పటిష్టమైన ప్రభుత్వం ఏర్పడడంతో ఐదేళ్లు ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు సాగుతుంది. కాబట్టి ఇదే అదునుగా ఎంఐఎంను తమ వైపునకు తిప్పుకోవాలని అందుకు ముందడుగుగా ప్రొటెం స్పీకర్ నియామకాన్ని చేపట్టినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. బీజేపీని తమ దరిదాపుల్లోకి కూడా రానివ్వని




కాంగ్రెస్ ప్రొటెం స్పీకర్ ను బీఆర్ఎస్ నుంచి తీసుకోవచ్చు. కానీ అలా చేయకుండా ఎంఐఎం నుంచి తీసుకోవడంలో స్నేహ హస్తం చాపినట్లు సంకేతం వెళ్తుందని భావించినట్లు తెలుస్తోంది. కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వానికి 64 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. బీఆర్ఎస్ కు 39, బీజేపీ 8, ఎంఐఎం 7, ఇతరులు 1. మ్యాజిక్ ఫిగర్ ను దాటి కాంగ్రెస్‌కు నలుగురు ఎమ్మెల్యేలు ఉండగా.. మ్యాజిక్ ఫిగర్ కు 21 సీట్ల దూరంలో బీఆర్ఎస్ ఉంది. మిత్ర పక్షమైన ఎంఐఎం 7 సీట్లను కలుపుకుంటే 46 అంటే మ్యాజిక్ ఫిగర్ కు 14 సీట్ల దూరం మాత్రమే ఉంటుంది. ప్రభుత్వం పటిష్టంగా ఉండాలంటే భవిష్యత్ లో ఎంఐఎం అవసరం అవుతుందని భావించిన కాంగ్రెస్ ఈ వ్యూహం అమలు చేసిందని టాక్ వినిపిస్తుంది. అంటే ఎంఐఎం కాంగ్రెస్ కు మద్దతిస్తే అసెంబ్లీలో తమ బలం 74కు పెరుగుతుంది. కాబట్టి బిల్లలు కూడా ఈజీగా పాస్ చేయించుకోవచ్చని కాంగ్రెస్ భావిస్తున్నట్లు టాక్ వినిపిస్తుంది.

**పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి చెక్ పెడుతుందా? :** శాసన సభ ఎన్నికలు ముగిశాయి. ఇక రానున్నది పార్లమెంట్ ఎన్నికలు. బహూశా ఇంకో నాలుగు లేదంటే ఐదు నెలల్లో వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఆ సీట్లను కూడా భారీగా కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నట్లు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నారు. దేశంలో మోడీ హవా కొనసాగుతోంది. ఐదు నెలల క్రితం అడపా దడపా నిర్వహించిన సర్వేల్లో కూడా మోడీ ప్రభుత్వం మరోసారి కొలువు దీరుతుందని ఫలితాలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఆశించిన దాని కంటే ఎక్కువ ఎంపీ సీట్లను దక్కించుకోవాలని పావులు కదుపుతోంది. ముస్లిం ఓట్లను కూడా భారీగా తమ ఖాతాకు మళ్లించుకునేందుకు సన్నాహాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. తెలంగాణలో 17 లోక్ సభ సీట్లలో ఎంఐఎం 1 లేదంటే 2 చోట్ల గెలిచినా మిగిలిన పార్లమెంట్ స్థానాల్లో ముస్లింల ఓట్లను బీఆర్ఎస్ కు వెళ్లకుండా కాంగ్రెస్ వైపునకు మళ్లించడంలో సఫలీకృతమైతే.. భారీగా సీట్లను గెలుచుకోవచ్చన్ని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు గిఫ్ట్ అంటూ అసెంబ్లీ ఎన్నికలు గెలిచిన రేవంత్ రెడ్డి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తానని చెప్తున్నారు. దీనికి ఎంఐఎంను కూడా కలుపుకుపోవాలని భావిస్తున్నారు. ఏది ఏమైనా కాంగ్రెస్ వ్యూహం సఫలీకృతమైతే ముస్లిం ఓట్లు మారితే సీట్లలో భారీగా తేడా వచ్చే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీ కంటే ఎక్కువ సీట్లను రాబట్టాలని ఇది సాధ్యమవుతుందని కాంగ్రెస్ అభిమానులు చెప్తున్నారు.

# కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీల జాతర

## ఆశావహులకు బంపర్ బొనాంజా.. 6కు పైనే..?



హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయంతో కాంగ్రెస్ పార్టీ నూతనోత్తేజం సంతరించుకుంది. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చి కూడా పదేళ్లు అధికారానికి దూరంగా ఉన్న ఆ పార్టీ.. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ సారి చావోరేవో అన్నట్లు పోరాడి గెలిచింది. దీంతోపాటు సోనియాగాంధీకి కానుక ఇచ్చింది. ఇక ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 64 సీట్లు గెలిచింది. శనివారం మంత్రులకు శాఖల కేటాయింపు, ఎమ్మెల్యేల ప్రమాణంతో ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొలువుదీరినట్లైంది. ఇకమీదట నామినేటెడ్ పోస్టుల నియామకం కొనసాగనుంది. కొందరు నాయకులకు ఎమ్మెల్సీ పదవులూ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి గెలిచారు.

ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ నుంచి వైదొలగిన కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ టికెట్ తెచ్చుకుని ఎమ్మెల్యే అయ్యారు.

**ఈ నలుగురూ రాజీనామా..** పల్లా, కడియం, కసిరెడ్డి, కౌశిక్ నలుగురూ ఎమ్మెల్సీ పదవులు వదులుకోవాల్సి ఉంటుంది. వీరేకాక గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకమూ పెండింగ్ లో ఉంది. ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాల్లో పల్లా స్థానిక సంస్థల నుంచి గెలిచారు. కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి 2021 శాసనమండలి ఎన్నికల్లో ఎమ్మెల్యే%ఖ% కోటాలో ఎమ్మెల్సీలు అయ్యారు. వీరికి 2027 నవంబరు వరకు పదవీకాలం ఉంది. డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి 2015లో తెరాస తరఫున నల్లగొండ, వరంగల్, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 2021లో రెండోసారి నెగ్గారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవీ కాలం 2027 వరకు ఉంది. కసిరెడ్డి నారాయణరెడ్డి కూడా తాజాగా ఎమ్మెల్సీ పదవిని వదులుకున్నారు.నిబంధనల ప్రకారం 15 రోజులలోపు ఏదో ఒక సభ్యత్వానికి రాజీనామా చేయాలి. ఖాళీ అయిన స్థానానికి ఎన్నికల కమిషన్ ఆరు మాసాలలోపు ఎన్నికలు జరుతుంది. కాగా, మారిన సమీకరణాల నేపథ్యంలో హస్తం పార్టీ వీటిని చేజిక్కించుకునే వీలుంది. గవర్నర్ కోటాలోని ఎమ్మెల్సీలూ కాంగ్రెస్ కే దక్కుతాయి.

**ఓడినవారికి మళ్లీ..** తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పలువురు పరాజయం పాలయ్యారు.

షబ్బీర్ అలీ వంటివారిని ఎమ్మెల్సీగా చేసి మంత్రి వర్గంలోకి తీసుకునే వీలుంది. లేదంటే నాంపల్లి నుంచి ఓడిన ఫిరోజ్ ఖాన్ నూ మండలికి ఎంపిక చేయొచ్చు. ఎలాగూ శాసన సభ్యుల బలం ఉంది కాబట్టి.. ఎన్నికల్లో అవకాశం ఇవ్వలేకపోయినవారికీ మండలి సభ్యత్వంతో సమాధానపరచవచ్చు.

అంతేగాక కాంగ్రెస్ అధికారంలో లేని పదేళ్లూ పార్టీని అంటిపెట్టుకున్న నాయకులకు న్యాయం చేయాల్సి ఉంటుంది. కాంగ్రెస పార్టీకి ప్రస్తుతం మండలిలో ఒక్కరే సభ్యుడు ఉన్నారు.

ఆయన సీనియర్ నేత జీవన్ రెడ్డి. ఇటీవల జగిత్యాల నుంచి పోటీ చేసి పరాజయం పాలయ్యారు. విశేష అనుభవం ఉన్న జీవన్ రెడ్డి సేవలను కాంగ్రెస్ పార్టీ వదులుకోదు.

# సంపాదకీయం

## కాంగ్రెస్ గెలుపు మీద పీకే వక్రభాష్యం..!

గెలుపు ఎపుడూ గెలుపే దానికి అర్థాలు పరమార్థాలు ఉండవు. విజయం అంటే అది కచ్చితంగా అలాగే చూడాలి. తగ్గించాలని ప్రయత్నాలు చేయడం అంటే వక్రంగా ఆలోచన చేయడమే. గెలుపు ఎపుడూ ఒక్కరికే దక్కుతుంది. ఒకరు గెలిచారు అంటే అవతల వారు ఓడ బట్టి మాత్రమే. మరి దాన్ని వక్రంగా ఆలోచిస్తే ఇంకోలా కూడా చెప్పవచ్చు. అదెలా ఉంటే వెనకవాడు ఓడిపోయాడు కాబట్టే ముందు వాడు గెలిచాడు అని కూడా తమదైన కోణం నుంచి చక్కగా చెప్పవచ్చు. కానీ అది సబబుగా ఉంటుందా అన్నది ఆలోచించాలి. వెనక ఒకడు ఉన్నాడూ అంటే వాడి కంటే మరొకరు ముందుకు రాబట్టి వారి కష్టఫలం బట్టి అని ఎందుకు ఆలోచించరాదు అన్నది కీలకమైన ప్రశ్న. అయితే మేధావితనం ఎక్కువగా ఉంటే చాలా ఇలాంటివి చెప్పవచ్చు. దానికి లాజిక్ అని కూడా కలిపి మరీ చెప్పవచ్చు. ఒక గ్లాస్ లో నీళ్ళు ఎక్కువగా ఉన్నాయని చెప్పవచ్చు. మూడవ వంతు మాత్రమే ఖాళీగా ఉందని కూడా చెప్పవచ్చు. తన మేధావి తనం అంతా ఏర్చి కూర్చి అనేక రాజకీయ పార్టీల కు ఎన్నికల వ్యూహకర్తగా పనిచేసిన ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకే ఇపుడు తెలంగాణా ఎన్నికలలో కాంగ్రెస్ గెలుపు మీద తనదైన విశ్లేషణ చేస్తున్నారు. కాంగ్రెస్ గెలవలేదు అని ఆయన అంటున్నారు. బీఆర్ఎస్ ఓడింది కాబట్టే కాంగ్రెస్ గెలిచింది అని అంటున్నారు. అయితే ఇదంతా బీఆర్ఎస్ ని పెంచడానికి కాంగ్రెస్ ని తగ్గించడానికి అని అంతా అంటున్నారు. బీఆర్ఎస్ ని ఆల్టర్నేషన్ మరో పార్టీ లేకనే ప్రజలు కాంగ్రెస్ కి ఓటేసారు తప్ప ప్రేమతో అభిమానంతో కాదని పీకే అంటున్నారు. మరి కాంగ్రెస్ కి మెజారిటీ ఇచ్చిన ప్రజలు వారి తీర్పుని పీకే ఇలా వేరేగా అర్థాలు చెబుతున్నట్లుగా ఉందని అంటున్నారు. మరో వైపు చూస్తే దేశవ్యాప్తంగా ప్రజా వ్యతిరేకత కూడగట్టుకుని అధికారంలో ఉన్న పార్టీలు ఓడాయని కూడా తెలంగాణాలోని బీఆర్ఎస్ ఓటమిని జనరలైజ్ చేస్తూ పీకే విశ్లేషిస్తున్నారు. అలాగే కాంగ్రెస్ ఉత్తరాదిన విజయం సాధించ లేదు అని గుర్తు చేస్తున్నారు. మొత్తానికి పీకే అయితే కాంగ్రెస్ విజయాన్ని వీలైనంత వరకూ తక్కువ చేస్తున్నారు. అయితే ఇంతకీ పీకే మరచిపోతున్న లాజిక్ పాయింట్ ఏంటి అంటే బీఆర్ఎస్ మీద వ్యతిరేకత ఉందని. ఆయన అది చెబుతున్నారు కానీ కాంగ్రెస్ కి సక్సెస్ క్రెడిట్ మాత్రం ఇవ్వడంలేదు. అందుకే బీఆర్ఎస్ ఎందుకు ఓడిపోయింది అన్నది కూడా పీకేని ప్రశ్నించాల్సి వస్తోంది అని అంటున్నారు. అదే విధంగా రెండు టెర్ములు బీఆర్ఎస్ కి అధికారం ఇచ్చినపుడు లేని లాజిక్కులు ఇపుడు కాంగ్రెస్ విషయంలో ఎందుకు వస్తున్నాయి పీకే అని కూడా అంతా ప్రశ్నిస్తున్నారు. ఆనాడు బీఆర్ఎస్ గెలిచింది వేరే ఆల్టర్నేషన్ లేకనే అని పీకేనే ప్రశ్నిస్తున్న వారు ఉన్నారు. ఇంతకీ పీకేకి ఈ బాధ ఎందుకు అంటే ఆయన బీఆర్ఎస్ కి కొన్నాళ్ళ పాటు వ్యూహకర్తగా పనిచేశారని అంటున్నారు. ఇక చివరి నిముషంలో బీఆర్ఎస్ అగ్ర నాయకత్వం కూడా పీకేని పిలిపించుకుని చివరి నిముషంలో ఆపరేషన్ ఏమైనా చేసేందుకు సిద్ధపడింది అని కూడా అంటున్నారు. ఏది ఏమైనా కాంగ్రెస్ తో చెడిన పీకే ఆ పార్టీ విజయాల మీద ఎపుడూ ఇలాగే మాట్లాడుతారు అని అంటున్నారు. ఇక బీజేపీ హిందీ బెల్ట్ లో మూడు రాష్ట్రాలు గెలుచుకుంటే ఆ పార్టీ సంస్థాగత బలం అని ఆ పార్టీ ఫిలాసఫీ అని చెబుతున్న పీకేకి తెలంగాణాలో కాంగ్రెస్ స్ట్రాంగ్ గా ఉందని తెలియదా లేదా తెలిసి తక్కువ చేసేందుకు చూస్తున్నారా అన్నది కూడా ప్రశ్నగా ఉంది. ఏది ఏమైనా పీకే ఇపుడు యాంటీ కాంగ్రెస్ స్లోగన్ తో ఉన్నారు. ఆయన నుంచి ఇంతకంటే ఎక్కువగా ఎక్స్ పెక్ట్ చేయలేమని అంటున్న వారూ ఉన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు స్వాగతం పలికిన ఉమ్మడి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



శామీర్ పేట(గరుడ వార్త) : కాంగ్రెస్ పార్టీ జెండాలు మోసి, కాంగ్రెస్ పార్టీ విజయానికి కారకులైన ప్రతి ఒక్కరికి తెలంగాణ రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సోమవారం రాజీవ్ రహదారి మీదుగా హుస్నాబాద్ నియోజకవర్గ పర్యటన వెళ్తుండగా తూంకుంట మునిసిపాలిటి పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేవరయాంజాల్,తూంకుంట,శామీర్ పేట మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు ఘన స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జగ్జీవన్ రామ్, రాజీవ్ గాంధీ, డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించి ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం కల్పించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలను ప్రవేశపెట్టమని, మిగతా నాలుగు త్వరలోనే ప్రజలకు అందజేస్తామని అన్నారు. తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి నివాసంలో తేనేటి విందుకు తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బాలేష్,టిపిసిసి కార్యదర్శి మహిపాల్ రెడ్డి,జిల్లా ఏ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, వివిధ మండలాల వై శంకర్ గౌడ్, బొమ్మల పల్లి నరసింహులు యాదవ్, కంతం కృష్ణారెడ్డి, మహేందర్ యాదవ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తి కుమార్, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు సురేష్ నాయక్,తూంకుంట మున్సిపల్ కౌన్సిలర్లు మధుసూదన్ రెడ్డి,పూజ భరత్ సింగ్, మాజీ సర్పంచ్ లావణ్య శంకర్ గౌడ్,మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీనారాయణ,మాజీ ఉపసర్పంచ్లు శంకర్ గౌడ్, రాజు,మాజీ సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ అనుబంధ సంఘాలు బీసీ సెల్,కిసాన్ సెల్,మైనార్టీ సెల్,సేవాదళ్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ,మున్సిపల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ రాంచందర్ యాదవ్, రవీందర్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత తప్పనిసరి

## మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్




జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజిగిరి (గరుడ వార్త) : సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలోనిర్వహించిన ప్రజావాణిలో భాగంగా వివిధ సమస్యల పై పిర్యాదులను సమర్పించడానికి వచ్చిన ప్రజల నుండి జిల్లా అదనపు కలెక్టర్ విజయంద్ర రెడ్డి తో కలిసి ప్రజల వద్ద నుండి (53) ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గౌతమ్ జిల్లా అధికారులకు సూచనలు చేశారు. ప్రజావాణి ఫిర్యాదులు సకాలంలో పరిస్కరించాలని, దానివల్ల ఫిర్యాదుదారుకు మేలు కలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి ఫిర్యాదుదారుకు ఫిర్యాదు పరిష్కారం అయింది లేనిది స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్ లైన్ లో అప్లోడ్ చేయడంతో పాటు అర్జీదారులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లా అధికారులు సైతం ప్రజావాణి ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తల్లి కూతుర్లు ఆత్మహత్యాయత్నం

## తల్లి క్షేమం, కూతురు గల్లంతు...

శామీర్ పేట(గరుడ వార్త) : నీటి కుంటలో దూకి తల్లి కూతుర్ల ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, స్థానికులు తల్లిని కాపాడగా, కూతురు మాత్రం గల్లంతయింది. ఇక వివరాల్లోకి వెళితే... శామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బొమ్మరాసిపేట గ్రామానికి చెందిన తల్లి కలమ్మ, కూతురు కవిత సోమవారం మధ్యాహ్నం వారి గ్రామ శివారులోని అబ్బన్న కుంటలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, స్థానికులు తల్లిని కాపాడగలిగారు,

అయితే కూతురు జాడ మాత్రం లభించలేదు. దీంతో సమాచారం అందుకున్న శామీర్పేట పోలీసులు రంగంలోకి దిగి గ్రామానికి చెందిన గజఈతగాళ్లు, ఫైర్ సిబ్బందితో గాలింపు



చేపట్టినప్పటికీ కవిత ఆచూకీ లభించలేదు. చీకటి కావడంతో గాలింపును మరుసటి రోజుకు వాయిదా వేయక తప్పలేదు.

కాగా తల్లి కూతుర్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# రాష్ట్రం ఏర్పడిన ఫలాలు దక్కలే..

## మళ్లీ ఆంధ్ర ప్రాంత కులాలను కలిపితే తీవ్ర అన్యాయమే..

## ఉద్యమ జేపీసీ చైర్మన్ కోదండరాం ను కలిసిన బీసీ ఏ గ్రూప్ ప్రతినిధులు..

హైదరాబాద్ : తెలంగాణ కోసం జేఏసీ పిలుపుమేరకు తెగించి కొట్లాడితే రాష్ట్ర ఏర్పడిందే తప్ప ప్రభుత్వ పథకాలు దక్కలేదని తెలంగాణ రాష్ట్ర బీసీ ఏ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ బాగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో బాగుపడలే కనీసం స్వరాష్ట్రంలో బతుకులు మారుతాయి అనుకుంటే ఇంకా దిగజారి పోయామన్నారు. ఈ మేరకు సోమవారం నాంపల్లి లోని తెలంగాణ జన సమితి పార్టీ కార్యాలయం లో ఉద్యమ నేత పార్టీ అధ్యక్షులు కోదండరాం ను పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి ఎం ఎస్ నరహరి, భాగయ్య కలిశారు. తెలంగాణలో తొలగించిన ఆంధ్ర ప్రాంతానికి చెందిన 27 కులాలను మళ్లీ ఆ జాబితాను తిరిగి బీసీ ఏ గ్రూపులో చేర్చాలని ప్రయత్నాలు చేస్తున్నారని కోదండరాం కు వివరించారు.

ఇది జరిగితే అత్యంత దారిద్ర రేఖకు దిగువన ఉన్న కులాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రొఫెసర్ బాగయ్య, ఎమ్మెస్ నరహరి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం తో పాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఏ గ్రూప్లో ఉన్న కులాలు అత్యంత నెగ్లెట్ కాబడ్డాయని, దీనితో ఆ కులాలు అత్యంత వెనుకబడి దౌర్భాగ్య స్థితిలో కొట్టుమిట్టాడు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు ఈ కులాలను పట్టించుకున్న పాపాన పోలేదని, ప్రభుత్వ ఫలాలు వీరికి అందని ద్రాక్షగా మిగిలిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇదే తరుణంలో ములిగే నక్క మీద గుడ్డు పడినట్టు ఆంధ్ర కు చెందిన బిసి 27 కులాలను మళ్లీ తెచ్చి తెలంగాణలో చేర్చితే ఈ కులాలు మరింత దిగజారిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

మరోపక్క ఆర్ కృష్ణయ్య ఆంధ్ర రాష్ట్రానికి చెందిన పదవిలో ఉంటూ ఆ కులాలను తెలంగాణలో కలపాలంటూ మాట్లాడడం ప్రయత్నాలు చేయడం తగదన్నారు. బీసీ నేతగా ఉన్న మీకు వీరి స్థితిగతులు తెలువావా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా నూతన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత మినిస్టర్స్ ఎట్టి పరిస్థితుల్లో తొలగించిన ఈ కులాలను చేర్చొద్దని కోరారు. మాకు జరుగుతున్న అన్యాయాలపై కోదండరాం దృష్టికి తీసుకెళ్లామని ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

# విమానాశ్రయం ప్రధాన యాక్సిస్ రహదారి పై 80 కిలోమీటర్ల మేర వేగంగా వాహనాలు నడపవచ్చు...

## సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

జిల్లా బ్యూరో (గరుడ వార్త) : ఇకమీదట రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ లోని ప్రధాన యాక్సిస్ రహదారి వేగ పరిమితులను 60 కిలోమీటర్ల నుండి 80 కిలోమీటర్ల మేర వాహనాలు నడపవచ్చని సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఓ ప్రకటనలు తెలిపారు. మొన్నటి వరకు విమానాశ్రయం ప్రధాన యాక్సిస్ రహదారిపై 60 కిలోమీటర్లకు మించి వేగంగా వాహనాలు నడపకూడదనే నిబంధన ఉండేది. కాగా ఈ మధ్యకాలంలో రోడ్డు నాణ్యతను పెంచి, వెడల్పు సైతం పెంచి, 80 కిలోమీటర్ల వేగంతో వాహనాలు ప్రయాణించి



నప్పటికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని నిర్ధారించిన తర్వాత ఎయిర్పోర్ట్ అధికారుల నుండి అనుపమ పొందిన, తరువాతనే సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ చట్టాన్ని అనుసరిస్తూ ఇక మీదట విమానాశ్రయానికి వెళ్లే వాహనదారులు సంబంధిత రోడ్లో 80 కిలోమీటర్ల మేర వేగంతో సైతం వాహనాలు నడిపించవచ్చని సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. అందుకు అవసరమైన సూచిక బోర్డులు సైతం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, మందుల పంపిణి

శామీర్ పేట(గరుడ వార్త) : మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దేమర్రి గ్రామంలో గ్రామ సర్పంచ్ యంజాల అనురాధరవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మెడిసిటీ హాస్పిటల్ వారు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు,చెవి,ముక్కు,గొంతు,వరిబీజము, బీజకుట్టు, గడ్డలు,కనతులు, థైరాయిడ్ గడ్డలు,గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ



నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు చూసి మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. వైద్య శిబిరంలో 136 మందికి షుగర్, బీపీ, టెస్టులు చేయడం జరిగిందని, ఆపరేషన్ అవసరము ఉన్న వాళ్ళను 66 మందిని మెడిసిటీ హాస్పిటల్ కు తరలించి ఉచిత ఆపరేషన్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోహన్ సింగ్, వార్డు సభ్యులు, డాక్టర్లు దస్తగిరి, మాజ్, శ్రేష్ఠ, అంజలి మార్కెటింగ్ ఇంచార్జి కుమారస్వామి, నాగార్జున, సత్యనారాయణ, పావని తదితరులు పాల్గొన్నారు.

# విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కానిస్టేబుల్

## జ్ఞాపకార్థం వికలాంగులకు అన్నదానం

శామీర్ పేట(గరుడ వార్త) : ప్రతి ఒక్కరు వికలాంగులకు వీలైనంత మేర చేయూతనివ్వాలని శామీర్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి ఆకాంక్షించారు. విధి నిర్వహణలో ప్రణాలు కోల్పోయిన కానిస్టేబుల్ జ్ఞాపకార్థం శామీర్పేట పోలీసులు వికలాంగులకు అన్నదానం నిర్వహించారు. శామీర్ పేట పోలీస్ స్టేషన్ కు చెందిన షరీఫ్ కానిస్టేబుల్ (2020 బ్యాచ్) గత సంవత్సరం పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. షరీఫ్ జ్ఞాపకార్థం



సోమవారం శామీర్ పేట ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి అధ్వర్యంలో మూడు చింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామం పరిధిలోని వికలాంగుల ఆశ్రమంలో సుమారు 240 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వికలాంగులను చేరదీసి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట ఎస్సైలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ భవలో.. ప్రైవేటు ఆసుపత్రుల నమోదు

మిర్యాలగూడ : గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని ప్రైవేటు ఆసుపత్రులకు వర్తింపజేయనున్నారు. నిర్దేశిత విధానంలో తమ ఆసుపత్రుల వివరాలను ఆయుష్మాన్ భవ విభాగంలో నమోదు చేసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం ప్రైవేటు ఆసుపత్రుల్లో సైతం వర్తింపజేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఈ కార్యక్రమాన్ని కొంత ఆలస్యంగా అనుమతించింది. దీంతో ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రుల వారు సైతం 'ఆరోగ్య సౌకర్యాల నమోదు' 'ఆరోగ్య ప్రొఫెషనల్స్ నమోదు' విధానంలో తమ ఆసుపత్రులు, వైద్యుల వివరాలు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎనిమిది నెలల క్రితం నుంచే ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో ఆయుష్మాన్ భవ కింద నమోదు చేస్తున్నారు.

నమోదు చేసుకున్న ప్రైవేటు ఆసుపత్రుల వారు ప్రతిరోజు ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆసుపత్రిలో చేరి వైద్యం పొందే వారి ఆరోగ్య సమాచారం ఆయుష్మాన్ భవ విభాగంలో నమోదు చేయాల్సి ఉంది.

కేంద్రం అందిస్తున్న రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రులతో పాటుగా, ప్రైవేటు ఆసుపత్రులకు వర్తింపజేసే దిశగా సన్నాహాలు చేస్తున్నారు.అన్ని ప్రైవేటు ఆసుపత్రుల వారు తమకు సంబంధించిన వివరాలు ఆయుష్మాన్ భవ విభాగంలో నమోదు చేసుకోవాలని సూర్యాపేట జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కోటాచలం కోరారు. ఆసుపత్రికి వచ్చే ఓపీ రోగుల వివరాలు సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

ఉమ్మడి జిల్లాలో ఇలా..వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమాచారం పంపారు. ప్రైవేటు ఆసుపత్రుల వారు వెబ్‌సైట్‌లోకి వెళ్లి నమోదు చేసుకోవాలని, లేని యెడల జిల్లా ఉపవైద్యాధికారి కార్యాలయంలో నిర్దేశిత వివరాలతో వచ్చి నమోదు చేసుకోవాలని ఆదేశించారు.నల్గొండ జిల్లాలో 159 ఆసుపత్రులు, 14 నర్సింగ్‌హోమ్‌లు, 49 డెలివరీ కేంద్రాలు, 111 స్కానింగ్ సెంటర్లు, 7 ఈఎన్‌టీ ఆసుపత్రులు, 24 కంటి వైద్యశాలలు, 18 చిన్నపిల్లల ఆసుపత్రులు, 51 దంత వైద్యశాలలు, 221 డయాగ్నొస్టిక్ సెంటర్లు ఇతర ఆసుపత్రులు కలిపి మొత్తం 611 ఉన్నాయి.సూర్యాపేట జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, నర్సింగ్‌హోమ్‌లు, కంటి, దంత వైద్యశాలలు సుమారు 223 వరకు ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లు, నేత్ర, దంత వైద్యశాలలు, డయాగ్నొస్టిక్ సెంటర్లు సుమారు 163 వరకు ఉన్నాయి.

# ఎత్తిపోస్తే 90 వేల ఎకరాల్లో సాగు

మిర్యాలగూడ : సాగర్ ఆయకట్టు పరిధిలోని చివరి భూములకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఎడమ కాల్వపై ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి అప్పట్లో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎడమ కాల్వ పరిధిలో 42 ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. వీటి కింద 90 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. లిఫ్టులు నిర్మించిన నాటి నుంచి ప్రభుత్వమే పూర్తి స్థాయిలో నిర్వహించింది. అప్పటి తెదేపా ప్రభుత్వంలో లిఫ్టుల నిర్వహణ బాధ్యతను లిఫ్ట్ కమిటీలకు అప్పగించి, వీటిని నిర్వహిస్తున్న నీటిపారుదల అభివృద్ధి సంస్థను రద్దు చేశారు. అప్పటి నుంచి లిఫ్ట్‌లు రైతుల పాలిట గుదిబండలుగా మారాయి. రైతుల మధ్య సమన్వయ లోపం, సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో లిఫ్ట్ నిర్వహణ తమ వల్ల కాదని రైతు కమిటీలు చేతులెత్తేశాయి. ఉద్యమ కాలంతో పాటు, ప్రభుత్వం ఏర్పడిన రెండు పర్యాయాలు తాము అధికారంలోకి వస్తే ఎడమ కాల్వపై ఉన్న ఎత్తిపోతల పథకాలను పూర్తి స్థాయిలో ప్రభుత్వమే నిర్వహిస్తుందని అప్పటి సీఎం కేసీఆర్ పలుమారు ఇచ్చారు. దశాబ్ద కాలం పూర్తయినా హామీ నెరవేరలేదు.

రూ.200 కోట్లతో ఆధునికీకరణ:

రైతు కమిటీ నేతల ఆందోళన మేరకు వీటిని సాగర్ ఆధునీకరణ ప్రాజెక్టులో చేర్చి, పూర్తి స్థాయిలో ఆధునీకరించారు. వీటి పర్యవేక్షణ బాధ్యతను ఎన్నెస్పీ శాఖకు అప్పగించి నిర్వహణను చేపట్టకపోవడంతో రైతులు రెండేళ్ల నుంచి భారంగా నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల నిర్వహణ లోపంతో లిఫ్ట్‌లు మూతపడే దశకు చేరుకున్నాయి. పూర్తి స్థాయిలో నిర్వహణ చేపట్టకపోవడంతో స్థిరీకరించిన ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్ల వ్యయం చేసి ఎత్తిపోతలను ఆధునీకరించినా, వాటి నిర్వహణ బాధ్యతను చేపట్టకపోవడంతో రైతులకు ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు.

ప్రతిపాదనలకే పరిమితం



ఎడమ కాల్వ పరిధిలోని ఎత్తిపోతల పథకాల నిర్వహణకు సిబ్బంది, నిర్వహణ ఖర్చులు ఏ మేరకు అవసరమవుతాయోనని సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేసి అప్పటి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఏళ్లు గడిచినా అది కార్యరూపం దాల్చలేదు. ప్రతి లిఫ్ట్ పరిధిలో ఆపరేటర్‌తో పాటు, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వ్యక్తిని నియమించేందుకు ఎంత వ్యయం వస్తుందనే అంచనాలను సిద్ధం చేసి ప్రభుత్వ పరిశీలనకు పంపారు. అది కార్యరూపం దాల్చలేదు.

ఆశతో అన్నదాతలు

నూతన ప్రభుత్వమైనా సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని లిఫ్టుల నిర్వహణ బాధ్యతను చేపట్టాలని ఆయకట్టు పరిధిలోని రైతులు కోరుతున్నారు. కుడి కాల్వ పరిధిలోని ఎత్తిపోతల పథకాలను ఎప్పటి నుంచో ప్రభుత్వమే నిర్వహిస్తోంది. ఎడమ కాల్వ పరిధిలోని ఎత్తిపోతల పథకాలను కూడా ప్రభుత్వమే పూర్తిస్థాయిలో నిర్వహించి, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.గతంలోనే ప్రతిపాదనలు పంపాం.సత్యనారాయణ, పర్యవేక్షక ఇంజినీరు, నీటి పారుదల శాఖ

లిఫ్టుల నిర్వహణ బాధ్యతలు ప్రభుత్వమే నిర్వహించేందుకు ఎంత మంది సిబ్బంది అవసరం, వేతనాలు, నెలవారీ నిర్వహణ వ్యయం తదితర వివరాలకు సంబంధించి పూర్తి స్థాయి అంచనాలను ప్రతిపాదించి గతంలో ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతం ఎడమ కాల్వ పరిధిలో ఉన్న లిఫ్టుల పరిధిలో ఆయకట్టుకు సాగునీరు అందేలా శాఖ తరఫున పర్యవేక్షణ చేస్తున్నాం.

# 6 గ్యారంటీలపై ఆశల ఊసులు



కరీంనగర్ : కొత్త ప్రభుత్వం కొలువు దీరిన వేళ.. ఉమ్మడి జిల్లా వాసులకు ఆరు గ్యారంటీల అమలుపై ఆశలు పెరుగుతున్నాయి. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలి సంతకం చేయడంతోపాటు ప్రభుత్వం ఏర్పాటైన తొలిరోజున గురువారం రాష్ట్రమంత్రి వర్గం భేటీలో ఈ నిర్ణయాలపై చర్చించడంతో యంత్రాంగం కూడా ప్రత్యేక దృష్టి సారిస్తోంది. పభుత్వం నుంచి అందనున్న మార్గదర్శకాల ప్రకారం నాలుగు జిల్లాల్లో వీటి అమలు, ఆచరణ దిశగా సరికొత్త కార్యాచరణ సిద్ధమవనుంది. డిసెంబరు 9 నుంచి రెండు గ్యారంటీలు అమలు చేస్తామని ఇప్పటికే మంత్రులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆరు గ్యారంటీల అర్హులు ఎవరు అవుతారనే విషయమై సంబంధిత శాఖల అధికారులు నాలుగు జిల్లాల పరిధిలో కసరత్తు ప్రారంభించనున్నారు.

వరంగా..మహాలక్ష్మి

ఆరు గ్యారంటీల్లో తొలి హామీ మహాలక్ష్మి. ప్రతి నెలా మహిళలకు రూ.2500లను అందిస్తారు. నాలుగు జిల్లాలో 49,768 స్వయం సహాయక సంఘాలుండగా 5,70,931 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను ఎంపిక చేసి అందులో అర్హులను గుర్తిస్తే ప్రతి నెల సుమారుగా 2.50 లక్షల మందికి ఈ ప్రయోజనాన్ని అందించాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. డిసెంబరు 9 నుంచి అమలవనున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణంతో రోజుకు 40 వేల మందికి లబ్ధి చేకూరే అవకాశముందని అంచనా. ఉమ్మడి జిల్లాలో సగటున రోజుకు 80 వేల మంది ప్రయాణాన్ని సాగిస్తుంటారు. ఇందులో మహిళలు సగం వరకుంటారు. ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌కు ప్రస్తుతం రోజుకు రూ.1.40 కోట్లు ఆదాయం సమకూరుతోంది. మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల రోజుకు రూ.70లక్షల భారం పడేవీలుంది. గ్యాస్ సిలిండర్‌ను రూ.500లకు అందించనుండటంతో నాలుగు జిల్లాల పరిధిలో దాదాపుగా 2లక్షల మంది గృహాల్లోని మహిళల వంటింటి బడ్జెట్ ఆదా అవనుంది.

మరింతగా.. రైతు భరోసా

ప్రస్తుతం రైతుకు పెట్టుబడి సాయంగా అందుతున్న మొత్తం ఇక మీదట ఎకరానికి రూ.15 వేలుగా అందనుంది. నాలుగు జిల్లాల పరిధిలో 6,25,951 మంది రైతులున్నారు. వీరికి చెందిన 12,88,198 ఎకరాల భూమికి రైతుబంధు సాయం ఏడాదికి రూ.1288 కోట్లు అందాయి. ఇక మీదట పెంచిన సాయం కలిపి ఏడాదికి రూ.1932 కోట్లు అవసరమవుతాయి. వీరేకాకుండా కౌలు రైతులకు రూ.15వేలు ఇవ్వనుండటంతో సుమారుగా 40వేల మంది ఈ కోవలోకి రానున్నారు. భూమిలేని వ్యవసాయ కూలీలు మరో 50వేల మంది ఉంటారు. వీరికి కూడా ఏడాదికి రూ.12 వేలనందించే భరోసాతో మేలు జరగనుంది. వరి పంటకు క్వింటాకు రూ.500 బోనస్‌ను అందించే వెసులుబాటుతో ఎక్కువగా ధాన్యాన్ని పండించే రైతులకు మేలు జరగనుంది. తాలు రూపంలో పోయే నష్టానికి అదనంగా ఈ బోనస్ దక్కనుంది.

చేయూత ద్వారా పింఛన్ అందుకుంటున్న వారికి ప్రతి నెలా రూ.4 వేల ఆసరా అందించడమనేది ఆరో గ్యారంటీ. ప్రస్తుతం నాలుగు జిల్లాల్లో 5,32,041 మంది ఆసరా పింఛన్లను అందుకుంటున్నారు. రూ.3016 స్థానంలో రూ.4 వేలు వీరికి అందనున్నాయి. ఇప్పుడున్న వీరితోపాటు కొత్తగా అర్హులు చేరితే మరో 50 వేల మందికి కొత్తగా పింఛన్ అందే అవకాశం ఉంటుంది. దీంతోపాటు రాజీవ్ ఆరోగ్య శ్రీ బీమా కింద రూ.10 లక్షల ఆర్థిక చేయూతనందించాలనే నిర్ణయంతో పేదలకు మేలు జరగబోతోంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో నాలుగు జిల్లాల పరిధిలో 8,256 మంది ఆరోగ్యశ్రీ సేవల్ని అందుకున్నారు. ఈ సంఖ్య ఇటీవల పెరిగింది. సగటున ఉమ్మడి జిల్లాలో 11వేల మంది ఆరోగ్యసేవల్ని పొందుతున్నారు. వీరందరికి ఆరోగ్య చేయూతతో లాభం జరగనుంది.

యువ వికాసం పేరిట ప్రవేశపెట్టే మరో గ్యారంటీతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 40 శాతం యువతకు మేలు జరిగే వీలుంది. నాలుగు జిల్లాల పరిధిలో ప్రతి ఏడాది ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు 1.50 లక్షల మంది ఉంటారు. వీరికి రూ.5 లక్షల విద్యా భరోసా కార్డును అందించాలనే లక్ష్యంతో ఈ సర్కారు ముందుకెళ్తోంది. దీని వల్ల ప్రతి ఏడాది నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి కార్పొరేట్ విద్య సహా ఇతర ఫీజులకు ఉపయుక్తంగా మారేందుకు ఈ కార్డు భరోసానివ్వనుంది. ఏడాదికి నాలుగు జిల్లాల్లో దాదాపుగా 8వేల మందికిపైగా ఈ సాయం అందితే పేదింట విద్యావికాసం మరింతగా పెరగనుంది. ప్రతి మండలానికి తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలన్న హామీ అమలైతే నాలుగు జిల్లాల పరిధిలో 63 మండలాల విద్యార్థులకు మేలు జరగనుంది.

గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తుని అందించాలని నిర్ణయించారు. దీంతో నాలుగు జిల్లాల పరిధిలో ఉన్న పేద కుటుంబాలకు మేలు జరగనుంది. ప్రస్తుతం అన్నిరకాల విద్యుత్తు కనెక్షన్లు కలిపి 16,25,205 ఉన్నాయి. ఇందులో గృహావసరాలకు సంబంధించినవి 12లక్షలకుపైగా ఉంటాయి. 200 యూనిట్ల లోపు విద్యుత్తును వాడే వారి సంఖ్య గ్రామాల్లోనే ఎక్కువగా ఉండనుంది. దీంతో ఈ కేటగిరీలో ఎంతమంది వస్తారనే కోణంలో ప్రభుత్వ సూచనల ప్రకారం ముందుకెళ్లే పనిలో విద్యుత్తు శాఖ అధికారులున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు అందించాలనే ఆశయం కొత్త సర్కారుది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే చాలా గ్రామాల్లో ఈ ఇందిరమ్మ ఇళ్లు నిర్మితమయ్యాయి. ప్రస్తుతం ప్రతి గ్రామంలో 100 నుంచి 200 మంది లబ్ధిదారులుగా మారే అవకాశముంది. ఈ లెక్కన 1,218 పంచాయతీల్లో 1.21 లక్షల నుంచి 2లక్షలకుపైగా లబ్ధిదారులకు వీటిని అందించాల్సి ఉంటుంది. విడతల వారీగా ఈ ఎంపిక ప్రకియ ఉండే వీలుంది. ఇదే కాకుండా అసలు పూర్తిగా నివాస గృహం లేని వారికి స్థలం ఇవ్వడంతోపాటు రూ.5 లక్షల సాయం గూడుకు భరోసానివ్వనుంది. ఉద్యమకారుల కుటుంబాలకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలనే నిర్ణయంతో నాలుగు జిల్లాల పరిధిలో ఉన్న సుమారు 100కుపైగా కుటుంబాలకు సొంత జాగా రూపంలో అండ దొరకనుంది.

# కొత్త వారు రాక.. ఉన్నవాళ్లు చదవలేక

సిరిసిల్ల : సిరిసిల్లలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభించి మూడేళ్లవుతుంది. దీనిలో టెక్స్‌టైల్ టెక్నాలజీలో రెండేళుగా ఒక్కరూ ప్రవేశాలు పొందలేదు. తొలి ఏడాది ఎంసెట్, ఈసెట్ ద్వారా వచ్చిన 14 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ కోర్సుకు రెండేళ్లుగా అగ్రహారం పాలిటెక్నిక్ డిప్లొమా, ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తున్నారు. జేఎన్‌టీయూలోనే కొత్త కోర్సు కావడం, మూడేళ్లుగా కనీసం సిలబస్‌ను రూపొందించకపోవడం చూస్తుంటే బోధన ఏ తీరున సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ, సీఎస్‌ఈ కోర్సుల ప్రయోగాల కోసం కొండగట్టు జేఎన్‌టీయూకు పంపుతున్నారు. 2021లో ప్రారంభమైన కళాశాల భవన నిర్మాణాలకు ప్రభుత్వం ఇటీవల తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో స్థలం కేటాయించింది. ప్రస్తుతం అగ్రహారం డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని కొంత భాగాన్ని జేఎన్‌టీయూ కళాశాలకు వినియోగిస్తున్నారు.

ఏమిటీ సమస్య?ప్రపంచ వ్యాప్తంగా రొబోటిక్స్, ఐవోటీ, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్, ఏఐ తదితర ఎమర్జింగ్ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. ఈక్రమంలో కోర్ బ్రాంచిలైన మెకానికల్, సివిల్ తదితర బ్రాంచిల్లో ప్రవేశాలు తగ్గాయి. ఈ బ్రాంచిలకు క్రమంగా డిమాండ్ తగ్గుతోంది. టెక్స్‌టైల్ విభాగానిది కూడా అదే పరిస్థితి. జేఎన్‌టీయూలో మూడేళ్ల క్రితం కొత్తగా ప్రవేశపెట్టిన ఈ కోర్సుపై శీతకన్ను వేశారు. ప్రవేశాలు పొందే సమయంలో కళాశాల అధ్యాపకులు ఉస్మానియాలోని టెక్స్‌టైల్ ఇంజినీరింగ్ విభాగంతో ఎంవోయూ చేసుకుని బోధన కొనసాగిస్తామని విద్యార్థులకు చెప్పారు. ఇప్పటికీ మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టినా ఆ ఊసేలేదు. ఇటు జేఎన్‌టీయూ కూడా కోర్సుకు సిలబస్‌ను రూపొందించలేదు. దీంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారు.

ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాలలోని 2018 సంవత్సరం టెక్స్‌టైల్ కోర్సు సిలబస్‌ను ఒప్పంద అధ్యాపకులతో రెండో ఏడాది బోధించారు. కళాశాలలో ఆరు కోర్సులకు గాను రెగ్యులర్ అధ్యాపకులు ముగ్గురు, ఒప్పంద ప్రాతిపదికన నలుగురు, పీరియడ్ లెక్కన బోధించేవారు 26 మంది ఉన్నారు. టెక్స్‌టైల్ మినహా మిగతా అయిదు కోర్సులు, మూడు సంవత్సరాలకు కలిపి 787 మంది విద్యార్థులున్నారు. క్యాంపస్ సెలక్షన్స్ కోసం పలు కంపెనీల బృందాలు ఈ ఏడాది కళాశాలలను సందర్శించనున్నాయి. ఆయా కంపెనీలు విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసుకుంటాయి. అన్ని కోర్సుల విద్యార్థులకు ఈ సంవత్సరం




ఎంతో కీలకం. ఇక టెక్స్‌టైల్ కోర్సులోని విద్యార్థులు మూడో సంవత్సరంలోకి వచ్చినా ఇప్పటికీ వీరికి కనీసం ల్యాబ్‌లు లేవు. స్టడీ టూర్ల ఊసేలేదు. దీనిపై విద్యార్థులు రెండు నెలల క్రితం జేఎన్‌టీయూ ఉప కులపతికి ఆన్‌లైన్‌లో వినతి పత్రం సమర్పించారు. అయినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదు.

ఇలా చేస్తే మేలు..

సంప్రదాయ కోర్సులు కనుమరుగవుతున్న వేళ విద్యార్థులకు మంచి ఉపాధి కల్పించే టెక్స్‌టైల్ కోర్సులను ఇంకా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఆధునికతకు తగ్గట్టుగా దుస్తుల తయారీలో యువతను ఆకట్టుకోవడంతో పాటు ఈ రంగంలో దీర్ఘకాలం ఆదరణ పొందవచ్చు. దానివల్ల జిల్లాలోని వస్త్ర పరిశ్రమ మరింత విస్తరించడంతోపాటు వృద్ధి చెందుతుంది. ఇవన్నీ జరగాలంటే కళాశాల స్థాయిలోనే విద్యార్థులకు ఈ రంగంపై పూర్తి పట్టు తీసుకురావాలి. అప్పుడే యువత వస్త్ర పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తారు. పాలిటెక్నిక్ కళాశాలలోని డిప్లొమా, జేఎన్‌టీయూలోని ఇంజినీరింగ్ కోర్సులతో ఈ రంగంలోని అవకాశాల గురించి విద్యార్థులకు తెలియజేయాలి. దానికి అవసరమైన నూతన పాఠ్య ప్రణాళిక, బోధన సిబ్బంది, మౌలిక సదుపాయాలను కల్పించేలా చొరవ చూపాలి. అవసరమైతే టెక్స్‌టైల్ పార్కు, అపరెల్ పార్కులోని పరిశ్రమలతో సమన్వయం చేసుకోవాలి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ వంటి సంస్థలతో ఒప్పందం చేసుకోవాలి. అప్పుడే భవిష్యత్తులో సిరిసిల్లలో వస్త్రోత్పత్తి రంగంలో విప్లవాత్మక మార్పులకు అవకాశం ఉంటుంది. ఫలితంగా ఇక్కడ జేఎన్‌టీయూలో టెక్స్‌టైల్ కోర్సు ఏర్పాటు లక్ష్యం నెరవేరుతుంది.

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాంకోర్సుల వారీగా విద్యార్థులకు బోధనలో ఎలాంటి ఇబ్బందులు లేవు. ఒప్పంద ప్రాతిపదికన అన్ని కోర్సులకు పూర్తిస్థాయి అధ్యాపకులు ఉన్నారు. కళాశాల భవనం, ల్యాబ్‌ల నిర్మాణంపై జేఎన్‌టీయూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.శ్రీనివాస్, ప్రిన్సిపల్, జేఎన్‌టీయూ, సిరిసిల్ల

# ఎస్‌ఎల్‌బీసీ సొరంగంపై చిగురిస్తున్న ఆశలు

నల్గొండ : శ్రీశైలం ప్రాజెక్టు వెనుక జలాల నుంచి టన్నెల్ ద్వారా వెనుకబడిన నల్గొండ జిల్లాకు సాగు, తాగు నీరందించేందుకు రూపకల్పన చేసిన శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) ప్రాజెక్టు పనులు ఈ ప్రభుత్వంలో పూర్తవుతాయన్న ఆశ ఉమ్మడి జిల్లా ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని 3.5 లక్షల ఎకరాలకు సాగునీరు, 500 గ్రామాలకు పైగా తాగునీరు ఇచ్చే ఉద్దేశంతో 2007లో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో రూ.1,925 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ 16 ఏళ్లలో సుమారు రూ.2500 కోట్ల వరకు ఖర్చుచేయగా.. పెరిగిన ధరల ప్రకారం ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం ప్రస్తుతం రూ.4776 కోట్లకు పెరిగింది. ఈ ప్రాజెక్టు కోసం అప్పట్లో పోరాటం చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి తాజాగా మంత్రి పదవీ దక్కడంతో నిధుల సమస్యను ఆయన పరిష్కరిస్తారని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ప్రాజెక్టులో కీలకమైన టన్నెల్ (సొరంగం) పనులు టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)లో ఏర్పడిన సాంకేతిక లోపాలు, విద్యుత్తు ఛార్జీలు, కార్మికుల బకాయిలు తదితర సమస్యల వల్ల గత ఏప్రిల్ నుంచి నిలిచిపోయాయి. దీంతో ఇక్కడ పనిచేస్తున్న మహారాష్ట్ర, ఝార?ండ్, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, జమ్ము, కశ్మీర్ రాష్ట్రాలకు చెందిన దాదాపు 300 మంది కార్మికులు సమ్మెకు దిగారు. దీనిని ఎంతకూ పరిష్కరించకపోవడంతో వారు స్వస్థలాలకు వెళ్లిపోయారు. మొత్తం 42 కి.మీ.ల సొరంగ మార్గానికి గానూ ప్రస్తుతం 33.5 కి.మీ. మేర పనులు పూర్తి చేశారు. ఏప్రిల్‌లో టీబీఎంలో సాంకేతిక లోపం ఏర్పడటంతో దానికి కావాల్సిన బేరింగ్‌లను జర్మనీ నుంచి తెప్పించాల్సి ఉండగా.. అధికార యంత్రాంగం, గుత్తేదారుల నిర్లక్ష్యంతో అది మరుగున పడింది. తాజాగా కొత్త ప్రభుత్వ ఏర్పాటుతో ఈ సమస్యకు పరిష్కారం



లభించే అవకాశాలున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

పదేళ్లలో రూ.500 కోట్ల మేర నిధులు

భారాస ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టుకు నిధుల కటకట వేధించింది. పదేళ్లలో కేవలం రూ.500 కోట్ల మేర మాత్రమే నిధులు విడుదల చేశారని కాంగ్రెస్ నాయకులు వెల్లడిస్తున్నారు. దీంతో ఈ నిధులు ఏ మూలకు సరిపోకపోవడంతో ప్రాజెక్టు పురోగతి ఒక అడుగు ముందుకు మరో అడుగు వెనక్కి వెళ్లింది. ఏటా బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపు చేసినా అవి విడుదలకు నోచుకోకపోవడంతో కార్మికులకు, గుత్తేదారు కంపెనీకి నిరాశే మిగిలింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే దీని కింద నిర్మాణం చేపట్టిన నక్కలగండి ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. నక్కలగండిలో నిర్వాసితులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇస్తే ప్రాజెక్టులో నీటినిల్వ చేసుకోవచ్చని అధికారులు వెల్లడిస్తున్నారు. సొరంగం పూర్తి చేసి నక్కలగండి ప్రాజెక్టును నింపితే దేవరకొండతో పాటూ మునుగోడు, నల్గొండ నియోజకవర్గాల్లోని చాలా గ్రామాలకు నీటి సమస్య తీరనుంది. ' ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రాజెక్టుపై పూర్తిస్థాయి రివ్యూ చేస్తాం. తక్షణం ఎన్ని నిధులు అవసరం అవుతాయి..ప్రాజెక్టు పూర్తికి ఎంత మొత్తం అవసరం అవుతాయనే వివరాలతో పాటూ ప్రాజెక్టు పరిస్థితిపై ఓ నివేదిక తయారు చేస్తాం. అనంతరం దాన్ని ప్రభుత్వానికి అందజేస్తా"మని సంబంధిత అధికారి వెల్లడించారు.

# అల్పాహారం కొందరికే!

సంగారెడ్డి : విద్యార్థుల ఆకలి తీర్చేందుకు గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అల్పాహారం పంపిణీ కార్యక్రమం జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. అక్షయ పాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం అందిస్తున్న 17 మండలాల్లో కేవలం పదుల సంఖ్యలోని బడుల్లో మాత్రమే అల్పాహారం పంపిణీ చేస్తున్నారు. మిగిలిన పాఠశాలల్లో ఇప్పటికీ ప్రారంభం కాలేదు. అక్షయ పాత్రతో సంబంధం లేకుండా వంట ఏజెన్సీల ద్వారా మధ్యాహ్న భోజనం అందిస్తున్న మిగతా పాఠశాలల్లోనూ అల్పాహారం పథకం పూర్తిగా అమలు కావడం లేదు. అమలవుతున్న కొన్ని బడుల్లో మెనూను పాటించడం లేదు. ఉప్మా, అటుకులు వడ్డిస్తూ చేతులు దులుపుకొంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్త పరిశీలన కథనం.

17 మండలాల్లో నామమాత్రం

జిల్లాలో మొత్తం 28 మండలాలున్నాయి. 17 మండలాల్లోని పాఠశాలల్లో అక్షయ పాత్ర సంస్థ ద్వారా పిల్లలకు మధ్యాహ్న భోజనం అందిసున్నారు. ఉదయం అల్పహారం కూడా ఈ సంస్థ ద్వారానే అందించాల్సి ఉంది. ఒప్పందం కొలిక్కి రాకపోవడంతో వీరు అల్పాహారం అందించడం లేదని సంగారెడ్డిలోని ఓ ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఈ మండలాల పరిధిలో 612 పాఠశాలలు ఉంటే కేవలం 12 చోట్ల మాత్రమే అల్పాహారం అందిస్తున్నారు. విజయదశమి తరువాత పూర్తి స్థాయిలో పథకాన్ని అమలు చేస్తామని అధికారులు ప్రకటించినా.. ఆ దిశగా చర్యలు లేవు.

అరకొరగా పంపిణీ నారాయణఖేడ్ నియోజకవర్గంలో దసరా తరువాత అన్ని పాఠశాలల్లో ఉదయం అల్పహారం అమలు చేశారు. ఎన్నికలు రావడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రస్తుతానికి 65 శాతం పాఠశాలలో మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ఉప్మా, అటుకులతో నెట్టుకొస్తున్నారు. పాత బిల్లులే రావడం లేదు. ఈ బిల్లులు వస్తాయో లేదోనని వంట ఏజెన్సీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

జహీరాబాద్ పరిధిలోని అల్లీపూర్ ప్రాథమిక, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరిశీలించగా.. నాణ్యతగా లేకపోవడంతో తినలేకపోతున్నట్లు విద్యార్థులు తెలిపారు.

నాగల్‌గిద్ద మండలం ముక్టాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందడం లేదు. ఉదయం 10 గంటలైనా విద్యార్థులు ఎదురు చూస్తూ కనిపించారు. అక్కడున్న వంట గదికి తాళం వేసి ఉంది. ఈ విషయమై స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులను అడగ్గా.. ఆలస్యమైనా రోజూ పెడుతున్నట్లు పేర్కొన్నారు. మెనూ పాటించడం లేదన్నారు.

సిర్గాపూర్ మండలం ఖాజపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉదయం 9.30 గంటల వరకు అల్పాహారం వడ్డించలేదు. బోరు పాడవడంతో నీటి కొరత వల్ల ఆలస్యమైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు తరగతి గదిలోకి వెళ్లిన తరువాత ప్రారంభిచండంతో తరగతులకు ఇబ్బందిగా మారింది.

జిల్లాలో ఇలా..

మొత్తం పాఠశాలలు: 1248

అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం అందుతున్నవి: 672

వంట గ్రూపులతో అమలవుతున్నవి: 576

ఉన్నతాధికారులకు నివేదిస్తాం- వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి

జిల్లాలోని చాలా పాఠశాలల్లో అల్పాహారం అమలు కావడం లేదు. అక్షయ పాత్ర ద్వారా భోజనం అందిస్తున్న చోట్ల అల్పాహారం పంపిణీ లేదు. ఇతర చోట్ల కూడా కొన్ని సమస్యలున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం ఇచ్చిన మెనూను తప్పకుండా అమలు చేయాలి.

# పల్లెల్లో మద్యం జోరు

జగిత్యాల : పల్లెల్లో మళ్లీ మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. నెల రోజులుగా ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో మద్యం అమ్మకాలు నిషేధించారు. కోడ్ ఎత్తేయడంతో పరిస్థితి మళ్లీ మొదటి కొచ్చింది. ఒక్కో గ్రామంలో 3 నుంచి 8 వరకు మద్యం గొలుసు దుకాణాల ఏర్పాటుతో పలువురు బానిసలుగా మారుతున్నారు. జిల్లాలో 380 గ్రామ పంచాయతీలు ఉండగా దాదాపు 1200కుపైగా మద్యం గొలుసు దుకాణాలు ఉన్నాయి. జిల్లాలో 71 మద్యం లైసెన్స్‌డ్ దుకాణాలు ఉండగా ప్రతి రోజు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు అమ్మకాలు సాగుతున్నాయి. మద్యం దుకాణాల్లో ఎంతమేర అమ్మకాలు సాగుతున్నాయో.. గొలుసు దుకాణాల్లోనూ రూ.1 కోటి నుంచి రూ.1.50 వరకు అమ్మకాలు సాగుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

నెల రోజులుగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో అమ్మకాలను పూర్తిగా నిషేధించాలని, నిలువ చేసిన మద్యం నిలువలు పట్టుకోవాలని ఆదేశించటంతో నిఘా ఏర్పాటు చేసి రూ.కోట్ల మేర మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కోడ్ ముగియటంతో యథాస్థితి నెలకొంది. ఇన్నాళ్లు పరిస్థితి బాగుందేందని ఇప్పుడు మళ్లీ మద్యం గొలుసు దుకాణాలు వెలిసినట్లు గ్రామీణ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మద్యం



అమ్మకాలు పెరగటంతో రోజు కుటుంబాల్లో గొడవలు జరుగుతున్నాయని, కూలీనాలి చేసుకునే వారు వచ్చే ఆదాయంలో సగానికి పైగా మద్యానికి ఖర్చు చేస్తేబతికేది ఎలా అని గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆబ్కారీశాఖ మద్యం గొలుసు దుకాణాలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమైంది. గత కొన్నేళ్లుగా విక్రయాలు ఎలా పెంచాలి అనే అంశంపైనే పనిచేశారనే విమర్శలు వచ్చాయి. కొత్త ప్రభుత్వం మద్యం గొలుసు దుకాణలను ఎత్తివేస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని గ్రామీణ ప్రాంత మహిళలు వేచిచూస్తున్నారు. ఆబ్కారీశాఖ సైతం మద్యం అమ్మకాలు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# పనుల్లో జాప్యం.. పెరగాలి వేగం

కరీంనగర్ : అయిదేళ్లకు ఒకసారి జరిగే శాసనసభ సాధారణ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. రెండు నెలలుగా అమల్లో ఉన్న ఎన్నికల కోడ్ మూడు రోజుల కిందట ముగిసినట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, అధికారులు ఎప్పటిలాగే యథావిధిగా కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలోని నగర, పురపాలికల్లో పరిధిలో అభివృద్ధి పనుల వేగం పెంచాలంటూ కథనం.

రెండు నెలలుగా కదలిక లేక...

రెండు నెలలుగా ఎన్నికల కారణంగా పనుల్లో పురోగతి లేకపోగా, ఎన్నికల సంఘం పలువురు అధికారులు, ఉద్యోగులకు ఎన్నికల విధులను అప్పగించడంతో కార్యాలయాలు బోసిపోయాయి. అత్యవసర దస్త్రాలు, పనులు మినహాయిస్తే ఏ ఒక్కటీ ముందుకు కదలలేదు. మరో ఆరు నెలల వరకు నగరాలు, పట్టణాల్లో ఎలాంటి ఎన్నికలు లేకపోవడంతో ఆ లోపు పూర్తి చేసుకోవాల్సిన అవసరముంది. ముఖ్యంగా కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో స్మార్ట్‌సిటీ, సీఎంఏ నిధులు, జనరల్ ఫండ్, సుడాకు సంబంధించిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

ఆగుతూ.. సాగుతూ

ఎన్నికలను కారణంగా చూపించడంతో అభివృద్ధి పనులకు అంతరాయం కలిగింది. ప్రధానంగా కూడళ్ల సుందరీకరణ, సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఎన్నికల కోడ్ రాకముందు హడావుడిగా రూ.132 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. అన్ని డివిజన్లలో ఒకటెండ్రు చోట్ల ప్రారంభించి పూర్తి చేయగా మిగతా చోట్ల నత్తను మించి పోటీ పడుతున్నట్లుగా తయారైంది. పలు వీధుల్లో తవ్వి మురుగుకాలువలు, రహదారులు అసంపూర్తిగా వదిలేశారు. కొన్ని చోట్ల అయితే 20 రోజులుగా రాకపోకలు సాగించకుండా మారడంతో ఆయా ప్రాంతవాసులు అవస్థలు పడుతున్నారు. ఒక వైపు పూర్తి చేయడం, మిగతా వైపు వదిలేయడంతోనే సమస్యలు వస్తున్నాయి. వర్షం చినుకులతో బురదగా మారిందని ఆ ప్రాంతవాసులు ఆగ్రహిస్తున్నారు.

సమీక్షలతో ముందుకు సాగాలి

అభివృద్ధి పనులతోపాటు ప్రజలకు సంబంధించిన దస్త్రాలు, ఫిర్యాదులు పరిష్కరించేందుకు విభాగాల వారీగా మేయర్, కమిషనర్‌తోపాటు విభాగాల అధికారులు వరుస సమీక్షలు ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు చేపడితే ప్రజలకు సౌకర్యంగా మారనుంది.

రూ.37 కోట్ల పనులకు టెండర్లు

నగర పాలక సంస్థ పరిధిలో రహదారులు, మురుగుకాలువలు, తాగునీటి పైపులైన్లు, కమ్యూనిటీ భవన నిర్మాణాల కోసం సాధారణ నిధులు సుమారు రూ.20 కోట్లకు టెండర్లు పిలవాలని నిర్ణయించారు. కొన్నింటిని పిలవగా మిగతావి ఆన్‌లైన్ చేసే లోపే ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. టెండర్లు పూర్తయిన వాటికి ఖరారు చేసి, మిగతా పనులకు తిరిగి టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. సుడా పరిధిలోని గ్రామాల్లో సెంట్రల్ లైట్లు బిగించేందుకు, మానకొండూర్ చెరువు అభివృద్ధి, ఇతర పనులు చేసేందుకు రూ.17 కోట్లతో టెండర్లు పిలిచేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

దస్త్రాల పరిశీలనలో..

కార్యాలయంలో గత కొన్ని రోజులుగా విభాగాల్లో పని చేస్తున్న పర్యవేక్షకులు, అధికారులు, ఉద్యోగులు లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. రెవెన్యూ విభాగంలో పేరు మార్పిడి, ఇంటి నంబర్ల కేటాయింపు, ఆస్తి పనుల సవరణ, జనన, మరణాల ధ్రువీకరణల విచారణ, భవన అనుమతుల జారీ, ఇంటి నిర్మాణాలు, పట్టణ ప్రణాళికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారాలు, కొత్త నల్లా కనెక్షన్ల జారీ, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల జీతాభత్యాలు, ఉద్యోగుల ప్రయోజనాలు, పారిశుద్ధ్య విభాగంలో వాహనాల మరమ్మతులు వంటివి దస్త్రాలు పెండింగ్‌లో పడ్డాయి. జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరముంది.

# యోధులు వచ్చారు.. వికారాబాధలు తీరేనా!



వికారాబాద్ : ప్రభుత్వ పాలనలోని కీలకపోస్టులతో జిల్లా ప్రత్యేకతను సంచరించుకుంది. ఈ జిల్లాకు చెందిన వారే ఒకరు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగా, మరొకరికి స్పీకర్ పదవి వరించింది. కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఎనుముల రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. వికారాబాద్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గడ్డం ప్రసాద్‌కుమార్ శాసనసభాపతిగా నియమితులయ్యారు. ప్రభుత్వంలోనే కీలక స్థానంలో వీరు ఉండడంతో జిల్లా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక తమ ఆశలు, ఆకాంక్షలు నెరవేరుతాయని ఆశిస్తున్నారు. తాజా మాజీ సీఎం కేసీఆర్ గజ్వేల్‌ను రాష్ట్రంలోనే నమూనా నియోజకవర్గంగా అభివృద్ధి చేశారు. అదే తరహాలో వికారాబాద్ జిల్లాను కూడా ఈ నేతలు ప్రగతి వైపు పయనింపజేయాలని కోరుతున్నారు.

వీటిపై దృష్టి సారిస్తే ప్రయోజనం

ఇరుకుగా రైల్వే వంతెన: జిల్లా కేంద్రం వికారాబాద్‌లో రైల్వేవంతెన అధ్వానంగా మారింది. వాహనాల రద్దీ విపరీతంగా ఉండడంతో, దీనిని విస్తరించాల్సి ఉంది. ఎన్నికల ముందు గత భారాస ప్రభుత్వం రూ.90 కోట్లు మంజూరు చేయడంతో, శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభం కాలేదు. వికారాబాద్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసినప్పటికీ అవసరమైన గదులు, ఫర్నిచర్ సమకూర్చాల్సిన అవసరముంది.

ఆహ్లాద నిలయం అనంతగిరి: వికారాబాద్ అనంతగిరి కొండలు ఆహ్లాదానికి నిలయం. శని, ఆదివారాలు హైదరాబాద్ నుంచే కాకుండా, వివిధ ప్రాంతాలనుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తారు. వీరికి సరైన సౌకర్యాలు కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రోప్‌వేలు, ట్రెక్కింగ్ వంటివి ఏర్పాటు చేయాలి. వికారాబాద్– తాండూరు రోడ్డును విస్తరించాలి. సందర్శకులను ఆకట్టుకునేందుకు కృత్రిమంగా అందమైన గుహలు ఏర్పాటు చేయాలి. అందమైన పార్కులను ఏర్పాటు చేసి చిన్నారులకు క్రీడా పరికరాలను ఏర్పాటు చేయాలి.


ప్రగతికి పరిశ్రమల ఏర్పాటు: జిల్లాలో పరిశ్రమలు స్థాపనకు అడుగులు పడినా, పూర్తి స్థాయిలో ఏర్పాటు కాలేదు. నిరుద్యోగులకు అనుగుణంగా కంపెనీలు ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుంది. నిత్యం చాలా మంది హైదరాబాద్‌కు వెళ్లి, చిన్నపాటి ఉద్యోగాలు చేస్తున్నారు. వీరికి ఉపాధి అవకాశాలు కల్పించాలి. రాకంచర్ల, శివారెడ్డిపేటలో ఇప్పటికే పారిశ్రామిక వాడలున్నాయి. స్థలాలు కేటాయించినా పరిశ్రమలు మాత్రం నెలకొల్పలేదు. మర్పల్లి, నవాబ్‌పేట మండలాల్లో ఆహార శుద్ధి యూనిట్ల నిర్మాణానికి ప్రభుత్వం భూములు కేటాయించింది.

ఇరువురిపై ప్రజల కోటి ఆశలు

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం సత్వరం పూర్తి చేసి, సాగు నీటిని అందించాలి. తద్వారా వేల ఎకరాలు సస్యశ్యామలం కానున్నాయి. కోట్‌పల్లి జలాశయం నుంచి నిర్ణీత ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదు. 1967లో నిర్మాణమైనా నేటికి వరకు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ప్రధాన కాలువలు, తూములు శిథిలావస్థకు చేరాయి. జలాశయానికి పూర్వవైభవం తేవాలి. వికారాబాద్ శివసాగర్ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తామని ప్రకటించారు. పనులు ప్రారంభించలేదు.

వికారాబాద్ నుంచి కృష్టా రైల్వే లైన్‌ను పనులకు మంజూరు చేసి నిధులు కేటాయించాలి. వికారాబాద్ – పరిగి మీదుగా జిల్లాలో కొత్తగా ట్రాక్ నిర్మాణం చేపట్టాలి. వికారాబాద్ కొత్తగడి సమీపంలో, మర్పల్లి సమీపంలో నిర్మిస్తున్న అండర్ రైల్వే బ్రిడ్జి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వీటిని పూర్తి చేయాల్సిన అవసరం ఉందివికారాబాద్ పట్టణం చుట్టూ మూడు వైపులా రైల్వే అండర్ బ్రిడ్జిలను నిర్మించాలి. జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాటికి మరమ్మతు చేపట్టాల్సి ఉంది.

# వారిద్దరికే బాధ్యతలు ఇవ్వడం ఎందుకో?




హైదరాబాద్ : ధరణి పోర్టల్‌లో కొందరు అక్రమార్కులకు అనుకూలంగా పాస్‌పుస్తకాల్లో మార్పులు, చేర్పులు, మ్యుటేషన్లు చేసిన వ్యవహారంలో ధరణి సమన్వయ కర్త నరేష్, ఆపరేటర్ మహేశ్‌ల నియామకాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో మూడేళ్ల నుంచి వీరిద్దరూ పొరుగుసేవల ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. వారిని నియమించేటప్పుడు అధికారులు వారి అర్హతలను సక్రమంగా పరిశీలించలేదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా మొత్తం ధరణి వ్యవహారాలను జిల్లా కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులు స్వయంగా పర్యవేక్షించకుండా వారిద్దరికే బాధ్యతలు అప్పజెప్పడం వెనుక బలమైన కారణాలు ఏవైనా ఉన్నాయా? అన్న కోణంలో పోలీస్ పరిశోధనతో పాటు ఉన్నతాధికారులు కూడా సమాచారం సేకరిస్తున్నట్టు తెలిసింది. వారి అక్రమాలను ఎవరు ప్రోత్సహించారని కూడా ఆరా తీస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. న్యాయ వివాదాలు ఉన్నాయని తెలిసినా..ధరణి పోర్టల్‌లో సాంకేతిక అంశాలపై నరేష్, మహేశ్‌లకు బాగా అవగాహన ఉంది. ధరణికి సంబంధించిన న్యాయ వివాదాలు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో వారిద్దరికీ తెలుసు. సాధారణ రోజుల్లో పెండింగ్ వివాదాలను పరిష్కరిస్తే ఉన్నతాధికారులకు అనుమానం వస్తుందని భావించి ఎన్నికల సమయంలో సందట్లో సడేమియాలా చేతి వాటం ప్రదర్శించారు. వాస్తవానికి న్యాయ వివాదాలున్న భూములు, నిషేధిత జాబితాలో ఉన్న భూములపై ఆయా భూముల యజమానులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. న్యాయస్థానాల్లో వారికి అనుకూలంగా తీర్పులు వచ్చినప్పుడు తీర్పు ప్రతులతో రెవెన్యూ అధికారులను సంప్రదిస్తున్నారు. కలెక్టర్ అనుమతితో ధరణి పోర్టల్‌లో మార్పులు చేస్తున్నారు. ఇందుకు విరుద్ధంగా వారిద్దరూ సొంతంగా నిర్ణయాలు తీసుకుని కొందరు అక్రమార్కులకు అనుకూలంగా వ్యవహరించారు.

గోప్యంగా విచారణ...ధరణి పోర్టల్ ద్వారా అక్రమాలు చేసిన నరేష్, మహేశ్ వ్యవహారశైలి, వారి ద్వారా ఎవరు లబ్ధి పొందారన్న అంశాలపై జిల్లా రెవెన్యూ అధికారులు గోప్యంగా విచారణ చేస్తున్నట్టు సమాచారం. మరోవైపు తమపై పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలుసుకున్న వారిద్దరూ అజ్ఞాతంలోకి వెళ్లినట్టు తెలిసింది. కేసు దర్యాప్తు చేస్తున్న ఆదిభట్ల పోలీసులు వారి ఆచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ధరణి విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఇతర ఉద్యోగులు, సిబ్బందిని విచారించి కొంత సమాచారం సేకరించారు. దీని ఆధారంగా పరిశోధన ప్రారంభించారు.

# ఎల్‌ఆర్‌ఎస్‌పై ముందుకా.. వెనక్కా!

హైదరాబాద్ : కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో గతంలో హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) మొదలుపెట్టిన అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్) ప్రక్రియ ముందుకు సాగుతుందా.. నిలిచిపోనుందా అనే విషయంలో కొద్ది రోజుల్లో స్పష్టత రానుంది. హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) పరిధిలోని జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మధ్యలో ఆగిపోయిన ఎల్‌ఆర్‌ఎస్‌కు ఎన్నికల ముందు హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టింది. గతంలో దరఖాస్తు చేసుకొని రూ.10వేల ఫీజు చెల్లించిన లేఅవుట్లకు మాత్రమే ఇది వర్తింపజేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆయా లేఅవుట్లలో 10శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయి ఉండాలనేది నిబంధన పెట్టారు. ఇలాంటివి హెచ్ఎండీఏ పరిధిలో 1337లో లక్షన్నర ప్లాట్లు ఉండగా.. 40,389 రిజిస్ట్రేషన్ విభాగం కింద గుర్తించారు. తొలుత వీటికి క్రమబద్ధీకరణకే అనుమతి ఇచ్చారు. రియల్టర్లు ముందుకొచ్చి దరఖాస్తు చేసుకోగా ఇప్పటికే ఫీజు కింద హెచ్ఎండీఏకు రూ.కోట్లలో సమకూరింది. తరువాతి ప్రక్రియగా ప్రొసీడింగ్‌లు జారీ చేస్తే.. వాటి ఆధారంగా ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేస్తారు. ఈ ధ్రువీకరణ పత్రాలు అందకపోవడంతో ప్రక్రియలో తీవ్రజాప్యం చోటుచేసుకుంది. మధ్యలో సాఫ్ట్‌వేర్ ఇబ్బందులతో ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. చాలామంది డబ్బులు కట్టినా, ఇంతవరకు ప్రొసీడింగ్‌లు అందకపోవడంతో హెచ్ఎండీఏ ప్రణాళిక విభాగం చుట్టూ తిరుగుతున్నారు.



ఇంతలో ఎన్నికల నోటిఫికేషన్ రావడం.. ఏపీవోలు, ఇతర అధికారులు ఆ పనుల్లో తలమునకలవడంతో ఈ దరఖాస్తులు పూర్తిగా పక్కన పెట్టేశారు. ఇప్పటికే డబ్బులు చెల్లించినవారు ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఎదురు చూస్తున్నారు. అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణతో పెద్దఎత్తున ఆదాయం వస్తుందని హెచ్ఎండీఏ ఆశలు పెట్టుకుంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో పాటు పూర్తి స్థాయిలో మంత్రి, కమిషనర్ నియామకం తర్వాతే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముందని తెలుస్తోంది.

# అధ్వాన దారులు... తప్పని అవస్థలు!

బుగ్గారం : బుగ్గారం నుంచి రాయపట్నం వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. మద్దునూరు శివారులో కల్వర్టు పది సంవత్సరాలుగా రాళ్లు తేలి ప్రమాదకరంగా తయారైంది. దీంతో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడికి సమీపంలో రహదారి కోతకు గురవడంతో వాహనదారులు భయం భయంగా ప్రయాణం చేస్తున్నారు. చెట్ల కొమ్మలు రహదారి మీదికి రావడం మూల మలుపులు ఎక్కువగా ఉండటంతో తీవ్ర అవస్థలు పడుతూ ప్రయాణం చేస్తున్నామని వాహన చోదకులు అంటున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపినప్పటికీ మరమ్మతు పనులకు మోక్షం రావడం లేదు.

రోడ్డువిస్తరణ పనులతో..గొల్లపల్లి మండలంలోని చిల్వాకోడూర్ నుంచి వెల్గటూరు మండలంలోని స్తంభంపల్లి మధ్య సుమారు అయిదు నెలల క్రితం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. గొల్లపల్లి నుంచి లక్షెట్టిపేట, మంచిర్యాల వైపు వెళ్లే వారికి ఇది దగ్గరి మార్గం కావడంతో చాలా మంది ఇక్కడి నుంచి ప్రయాణం సాగిస్తారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా తవ్వి కంకరతో నింపారు. ఈ మార్గంలో చిల్వాకోడూర్ నుంచి లొత్తునూర్ వరకు సుమారు 4 కి.మీ వరకు కంకర తేలి ఉండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాహనాలు అదుపు తప్పుతున్నాయి. దీంతో కొద్ది మంది లొత్తునూరు వైపు వెళ్లే వారు మరో మార్గమైన గొల్లపల్లి మీదుగా సుమారు 15 కి.మీ ప్రయాణించి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు పనుల్లో పెంచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణం నాస్తి.. మరమ్మతులు జాస్తి

స్తంభంపల్లి నుంచి లొత్తునూరు వెళ్లే రహదారి పలు చోట్ల ప్రమాదకరంగా ఉంది. కొన్నిచోట్ల కోతకు గురి కావడంతో అధ్వాన్నంగా



తయారైంది. దీనికి తోడు ఇరువైపులా దట్టంగా చెట్ల కొమ్మలు రహదారి మీదికి రావడంతో వాహనదారులు భయంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. ప్రమాదకరంగా మూల మలుపులుండటం రహదారి సరిగా లేకపోవడంతో తాము అవస్థలు పడుతున్నామని వాహన చోదకులు అంటున్నారు.

నత్తనడకన పనులు జైన నుంచి దొంతాపూర్ వెళ్లే రహదారి సంవత్సరాల తరబడి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జైన మూల మలుపు, మగ్గిడి శివారు లోలెవల్ వంతెనల వద్ద రహదారి అంత్యంత ప్రమాదకరంగా ఉంది. కల్వర్టులకు రెండు వైపులా చదునుగా లేక గుంతగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు అదుపు తప్పుతున్నాయి. మరమ్మతు పనులు ప్రారంభించినప్పటికీ నత్తనడకన సాగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మెరుగైన రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

గండి పడిన ప్రాంతాల్లో ప్రమాదాలు

ధర్మపురి నుంచి బీర్‌పూర్ వరకు గల 12 కి.మీ.ల రహదారి అధ్వానంగా మారింది. కోరండ్లపల్లె వద్ద గత వానా కాలంలో భారీ వర్షాలతో రహదారిపై గండి పడింది. ప్రతిరోజు వందలాది వాహనాలు ఇదే రహదారి నుంచి కమ్మునూర్ వరకు వెళ్లుంటాయి. మధ్యన నక్కలపేట, దోనూర్, తీగలధర్మారం, బీర్‌పూర్, నర్సింహులపల్లె, తుంగూర్, కొల్వాయి, తాళ్లధర్మారం, కమ్మునూర్ వరకు రహదారి విస్తరించి ఉంది. గండిపడిన ప్రాంతంలో రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారి మరమ్మతు చేసేందుకు ప్రతిపాదలను పంపించారు. నిధులు విడుదల కాకపోవడంతో మరమ్మతులు కరవయ్యాయి. కోతకు గురైన రహదారికి మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ధాన్యం సేకరణపై తుపాను ప్రభావం

వేములవాడ : తుపాను ప్రభావం జిల్లాలో ధాన్యం సేకరణపై పడింది. గత రెండు రోజులుగా చినుకులు పడుతుండటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. విక్రయానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం అకాల వర్షంతో తడిసిపోతాయని అన్నదాతలు టార్పాలిన్ కవర్లు కప్పారు. దీంతో ధాన్యంలో తేమ శాతం మరింత పెరిగి తూకాలు కాక రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితి రావడంతో కర్షకులు ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లాలో నెలన్నర రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ చేపడుతున్నారు. కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్న తరుణంలో తుపాను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. చినుకులు పడటంతో చాలా కేంద్రాల్లో ధాన్యం కుప్పలపై రైతులు టార్పాలిన్ కవర్లు కప్పి తూకాల కోసం ఎదురుచూస్తున్నారు. నిబంధనల ప్రకారం తేమ శాతం వస్తే గానీ ధాన్యం తూకాలు అయ్యే పరిస్థితి లేదు. జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్, మెప్మా ఆధ్వర్యంలో 253 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ 248 కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం సేకరించారు. క్వింటాల్‌కు 'ఏ' గ్రేడ్‌కు రూ.2,203, 'బి' గ్రేడ్‌కు రూ.2,183ల మద్దతు ధర చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు 1,70,240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. చాలా కేంద్రాల్లో కొనుగోళు చివరి దశలో ఉన్నాయి. ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావడంతో 98 కేంద్రాలను అధికారులు మూసివేశారు. ధాన్యం విక్రయించిన రైతుల్లో ఇప్పటి వరకు 20,774 మంది రైతులకు రూ.268.16 కోట్ల మేర రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు అధికారులు చెబుతున్నారు.

అకాల వర్షంతో...వారం రోజులుగా ఆకాశంలో మబ్బులు పట్టడంతో పాటు రెండు రోజులుగా చినుకులు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొద్ది రోజులు గడిస్తే తూకం అవుతుందని ఆశతో ఉన్న రైతుల్లో తుపాను తీవ్ర నిరాశకు గురిచేసింది. అకాల వర్షంతో ధాన్యం కుప్పల్లో తేమ శాతం పెరిగిపోయి కాంటాలు కావడంలో జాప్యం నెలకొంది. కొందరు రైతులు వ్యాపారులకు ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించుకుంటున్నారు. చాలా కేంద్రాల్లో అయిదు నుంచి పది శాతం తూకాలు కావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ధాన్యం కుప్పలు పూర్తయితే కేంద్రాలను మూసివేయనున్నారు. తుపాను ప్రభావం లేకుంటే ధాన్యం తూకాలు సజావుగా సాగి చాలా వరకు కొనుగోలు కేంద్రాలను మూసివేసేవారని నిర్వాహకులు చెబుతున్నారు. కేంద్రాల్లో తూకాలు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అవసరం మేరకు లారీలను సిద్ధంగా ఉంచి తూకాలు అయిన బస్తాలను ఎప్పటికప్పుడు కేటాయించిన రైస్ మిల్లులకు తరలించారు. వర్షం ముగిసిన వెంటనే తూకాలు పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

# సిద్ధమవుతున్న ఖరీఫ్ ప్రణాళిక

అశ్వాపురం : జిల్లాలో వర్షాకాలం సాగుకు సంబంధించిన ఖరీఫ్ ప్రణాళిక సిద్ధమవుతోంది. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు పర్యటిస్తూ సాగు అంచనా విస్తీర్ణం సిద్ధం చేస్తున్నారు. ఏటా మృగశిరలో ఖరీఫ్ సాగు ప్రారంభమవుతుంది. ఈలోగానే ప్రణాళికను సిద్ధం చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో సిద్ధం కావచ్చని భావిస్తున్నారు. జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న సహా అన్ని పంటలు కలిపి దాదాపు 4.52 లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉన్నట్లు ప్రాథమిక అంచనా. గతేడాదితో పోలిస్తే ఈసారి ఖరీఫ్‌లో అన్ని పంటల విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నట్లు భావిస్తున్నారు. వరి వెయ్యి ఎకరాలు, పత్తి 10,400, కంది 5 వేలు, ఆయిల్‌పాం 1,300 ఎకరాల విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. వరి ఉత్పత్తి అధికంగా ఉండటం, సేకరణలో సమస్యలు, జిల్లాలో మిల్లర్ల సామర్థ్యం తక్కువగా ఉన్న నేపథ్యంలో గతేడాది ఖరీఫ్‌లో ఈ సాగును



తగ్గించేందుకు ప్రయత్నం చేశారు. పత్తి సాగును 20 శాతం పెంచడానికి ప్రయత్నించారు. అపరాలు, నూనె గింజల సాగుకు పెద్దపీట వేశారు. అధికారుల ప్రయత్నాలు కొంత ఫలించాయి. జిల్లాలో పత్తి విస్తీర్ణం సహా అపరాలు, నూనె గింజల సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. ఈ ఏడాది కూడా అదే ఒరవడిని కొనసాగించనున్నారు. ఇవికాక జిల్లాలో కూరగాయలు 2,597, మామిడి 7,600, జీడిమామిడి 8,541, పండ్లతోటలు 1,847, ఇతర ఆగ్రో రకాలు 20,895 ఎకరాల్లో సాగవుతున్నాయి. వీటి సాగుకు సంబంధించిన ప్రణాళికలనూ రూపొందించే ప్రయత్నాల్లో ఉన్నారు.

40వేల క్వింటాళ్లకుపైగా..వర్షాకాలం ఎక్కడా లోపం లేకుండా విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు అధికారులు యత్నిస్తున్నారు. పప్పుధాన్యాలు, నూనె గింజల సాగుపై రైతుల్లో అవగాహన కల్పించాలని భావిస్తున్నారు. మరోవైపు పత్తి విత్తనాలు మినహా మిగిలినవన్నీ రాయితీపై సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 40 వేల క్వింటాళ్లకు పైగా విత్తనాలు అవసరమవుతాయని అంచనా."జిల్లాలో ఖరీఫ్ సాగు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు కృషి చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో ప్రణాళిక సిద్ధమయ్యే అవకాశం ఉంది."– కె.అభిమన్యుడు, జిల్లా వ్యవసాయ అధికారి

# గ్రానైట్ అక్రమాల గుట్టు తేలేనా..?

కరీంనగర్ : గ్రానైట్ వ్యవహారంలోని డొల్లతనాన్ని బయటపెట్టేలా క్షేత్రస్థాయి విచారణకు ఉమ్మడి జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. గత నెలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు గ్రానైట్ క్వారీలు పర్యావరణానికి విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నాయనేలా జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) కన్నెర్ర చేయడంతోపాటు కొందరికి నోటీసులు జారీ చేయడంతో అధికారులు అప్రమత్తమవుతున్నారు. వ్యాపారాన్ని సాగించే పలు కంపెనీలు ఫెమా (ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్) నిబంధనల్ని ఉల్లంఘించాయనే విషయమై గత కొన్నాళ్లుగా కొనసాగుతున్న ఫిర్యాదులకు స్పందించిన న్యాయస్థానం సమగ్ర విచారణను చేపట్టాలని ఆదేశించింది. దీంతో ఈ నెల 10న కలెక్టర్ పర్యవేక్షణలో కరీంనగర్ జిల్లాధికారులు అత్యవసర సమీక్ష నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు విచారణను చేపట్టేందుకు ఆయా శాఖలతో కూడిన కమిటీని ఏర్పాటు చేయబోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 320 క్వారీల వద్ద ఉన్న వాస్తవ పరిస్థితుల్ని వీరు గమనించనున్నారు. కాలుష్య నియంత్రణ మండలి, జలవనరుల శాఖ, మైనింగ్, పోలీసు, రెవెన్యూ విభాగాలకు చెందిన కీలకమైన అధికారులను విచారణ సభ్యులుగా నియమించనున్నారు. ఈ నెల 19వ తేదీ లోగా సమగ్రమైన నివేదికను అందించేలా జిల్లా అధికారులు సమాయత్తమవుతున్నారు.

నిజాల నిగ్గు తేలేనా..?

గనుల ఖిల్లాగా మారిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సహజ వనరులను ఇష్టానుసారంగా దోపిడీ చేస్తున్నారనేలా తరచూ ఎవరో ఒకరు రాష్ట్ర, కేంద్రస్థాయిలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదులను అందిస్తున్నారు. ముఖ్యంగా 2013లో విజిలెన్స్ అధికారులు చేసిన తనిఖీల్లో గుర్తించిన అక్రమాల విషయంలో ప్రభుత్వానికి రావాల్సిన ఫెనాల్టీని ఎగవేశారంటూ హైదరాబాద్‌కు చెందిన పేరాల శేఖర్‌రావు గతేడాది నవంబరులో సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఆయా గ్రానైట్ సంస్థలు రూ.124.94 కోట్ల జరిమానాను ఐదింతలుగా రూ.749 కోట్లు చెల్లించలేదని, పైగా నిబంధనలకు విరుద్ధంగా పర్యావరణ దోపిడీ జరుగుతుందని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. గతంలోనూ జిల్లాకు చెందిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, వైఎస్సార్‌టీపీ నాయకుడు సింగిరెడ్డి భాస్కర్‌రెడ్డి, న్యాయవాది భేతి మహేందర్‌రెడ్డిలు కూడా గ్రానైట్ వ్యాపారంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరారు. వరుస ఫిర్యాదులతో స్పందించిన ఉన్నతాధికారులు, ఎన్‌జీటీలు ఉమ్మడి జిల్లాలోని ఖనిజ సంపద కొల్లగొడుతున్న విషయమై తగిన దృష్టిని సారించాయి. అనుమతి ఇచ్చిన క్వారీలలో ఇష్టానుసారంగా పేలుళ్లకు పాల్పడుతూ సమీపంలోని రైతులు, గ్రామాల ప్రజలకు నష్టం కలిగేలా చేస్తున్నారనే విషయమై విచారణ అధికారులు సమగ్రంగా పరిశీలనల్ని జరపనున్నారు. ఎప్పటికప్పుడు ఆయా క్వారీల్లో జరుగుతున్న మోసాలు, అక్రమాలపై జల్లా యంత్రాంగం అనుకున్న విధంగా స్పందించిన దాఖలాలు లేవు. కనీసం త్వరలో చేపట్టే విచారణనైనా పక్కాగా నిర్వహిస్తూ నిజాల నిగ్గును తేలిస్తే బాగుంటుందనే భావనను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అతిక్రమించిన నిబంధనలపై పక్కాగా వ్యవహరించడంతోపాటు లీజుల వ్యవహారాలు, ఇష్టానుసారంగా జరిగిన తవ్వకాలు, రాయి అమ్మకాలపై పూర్తిస్థాయి వివరాల్ని సేకరించాల్సిన అవసరముంది. మరి మన అధికారులు ఏమేరకు చొరవ చూపిస్తూ ఎలాంటి విచారణ సాగిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

# పదోన్నతులకు 'ముందస్తు' జాబితాలు



ఆదిలాబాద్ : ఉపాధ్యాయ పదోన్నతుల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండేలా విద్యాశాఖ అప్పుడే ముందస్తు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా కేటగిరీల వారీగా ఉపాధ్యాయుల జాబితాలను తయారుచేసింది. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11లోగా తెలపాలని కార్యాలయ వర్గాలు సంఘాల వాట్సాప్ గ్రూపులకు జాబితాలను పంపడం కౌన్సెలింగ్ ప్రక్రియ సాఫీగా సాగేలా జాగ్రత్తలు తీసుకుంటోంది. విద్యాశాఖ పరిధిలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ)లకు పదోన్నతి కల్పించే వెసులుబాటు ఉండటంతో.. ఆ మేరకు అధికారులు ముందస్తు కసరత్తులో నిమగ్నమయ్యారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు 205 ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 33, స్థానికసంస్థలు యాజమాన్య పరిధిలో 172 ఖాళీలు ఉన్నట్లుగా తేల్చారు. ఇందుకోసం ఒక్కో కేటగిరిలో ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులను గుర్తిస్తూ పదోన్నతికి అర్హులైన జాబితాలను తయారుచేశారు. ఆయా జాబితాల్లో మొత్తం 603 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు అర్హులుగా తేల్చి జాబితాలో చోటు కల్పించారు. పీఎస్‌హెచ్‌ఎంల పదోన్నతి కోసం 1986 నుంచి 2002 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు చోటు దక్కగా.. మిగిలిన స్కూల్ అసిస్టెంట్ల జాబితాలో 1989 నుంచి 2002 సంవత్సర డీఎస్సీ ఉపాధ్యాయులు ఉన్నారు.

కొన్నింటికి అర్హులు లేరట

మరాఠీ మాధ్యమంలో స్థానిక సంస్థల యాజమాన్య పరిధిలో స్కూల్ అసిస్టెంట్ గణితం, ఫిజిక్స్, ఉర్దూ మాధ్యమం ప్రభుత్వ యాజమాన్య పరిధిలో స్కూల్‌అసిస్టెంట్ సోషల్ స్టడీస్‌లో ఖాళీలు ఉన్నా అర్హులైన ఉపాధ్యాయులు లేనట్లుగా జాబితాల్లో విద్యాశాఖ పొందుపర్చింది. మొత్తం ఆయా సబ్జెక్టుల్లో నాలుగు పోస్టులకు అర్హులైన వారు లేకపోవడంతో అవి అలాగే మిగిలిపోనున్నాయి. గోప్యంగా కసరత్తు..అధికారికంగా ఇంకా షెడ్యూల్ విడుదల కానందున విద్యాశాఖ లోలోన కసరత్తు చేస్తోంది. గోప్యంగా వివరాలను ఉపాధ్యాయ సంఘాల వాట్సాప్ గ్రూప్‌లకు పంపించడం విమర్శలకు తావిస్తోంది. అందరికి తెలిసేలా కసరత్తు చేస్తే ప్రతి ఉపాధ్యాయుడికి సమాచారం చేరుతుందనే భావన వ్యక్తమవుతోంది.పదోన్నతి ఖాళీలు ఇవే..తెలుగు, హిందీ, మరాఠీ, ఉర్దూ మాధ్యమాలు కలిపి 50 కేటగిరీలకు కలిపి సబ్జెక్టుల వారీగా పదోన్నతి ఖాళీలు యాజమాన్యాల వారీగా ఇలా ఉన్నాయి. ఈ ఖాళీలకు ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులతో జాబితాలు తయారుచేశారు.

# మళ్లీ తెరపైకి 'ప్రైవేటు పంచాయితీ



ఆసిఫాబాద్ : గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించే అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఇందుకు గ్రామ పంచాయతీ సర్పంచుల నుంచి తీర్మానాలు పంపించాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ నుంచి జిల్లా పంచాయతీ అధికారులకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల క్రితం ఇలాంటి ఆదేశాలు జారీ కావడంతో జిల్లాలో 335 జీపీలకు గాను సుమారు 320 కిపైగా జీపీల్లో తీర్మానాలు తీసుకొని పంపించారు. తీర్మానాలు ఇచ్చినా.. ఈ విధానాన్ని చాలా పంచాయతీల్లో తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ప్రభుత్వం ఈ అంశంపై వెనక్కి తగ్గింది. మూడురోజుల క్రితం తీర్మానాలు పంపించాలని మళ్లీ ఉత్తర్వులు జారీ కావడం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ బాధ్యతను పంచాయతీలే చూస్తాయి. చాలా పంచాయతీల్లో సిబ్బంది కొరత, ఫిలమెంట్ బల్బుల ఏర్పాటుతో విద్యుత్తు వినియోగం పెరిగి బిల్లుల మోత మోగడం, సరైన ఆన్/ఆఫ్ వ్యవస్థ లేక నిరంతరం వెలుగుతున్న బల్బులతో విద్యుత్తు దుబారా కావడం, తరచూ కాలిపోవడం, వీటి కొనుగోళ్లలో అక్రమాలకు దారితీయడం తదితర సమస్యలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో ఎలాంటి వృథాకు తావులేకుండా విద్యుత్తు ఆదా కోసం ఫిలమెంట్ బల్బుల స్థానంలో ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణ కోసం ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సంస్థకు బాధ్యతలు అప్పగించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు గ్రామ పంచాయతీల నుంచి తొలుత ఈ నెల5 తర్వాత 7 లోపే తీర్మానాలు పంపాలని పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ తాజాగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారులు అన్ని జీపీల కార్యదర్శులకు విషయాన్ని తెలియజేసి సర్పంచుల ద్వారా తీర్మానాలు పంపించాలని ఆదేశించారు. ఇంకాచాలా చోట్ల రావాల్సి ఉంది.

సంస్థ నిర్వహణ ఇలా..గ్రామాల్లో విద్యుత్తు స్తంభాల సంఖ్యకు అనుగుణంగా ఎల్‌ఈడీ దీపాలు, వాటి అమరికకు అవసరమైయ్యే పరికరాలు ఇతర సామగ్రిని సంస్థే సరఫరా చేస్తూ నిర్వహణ చూడనుంది. ఇందుకోసం జిల్లా స్థాయిలో జిల్లా పంచాయతీ అధికారి ఈఎస్‌సీఆర్‌ఓడబ్ల్యూ ఖాతా తెరవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సామగ్రి, నిర్వహణ ఖర్చులను సంబంధిత పంచాయతీల నుంచి నెలనెలా జిల్లా పంచాయతీ అధికారి సేకరించి సంస్థ ఖాతాకు జమచేయాలి. ఏదైనా పంచాయతీ డబ్బులు చెల్లించకుంటే.. నెలనెలా ప్రభుత్వం పంచాయతీలకు ఇచ్చే నిధులు, సాధారణ కేటాయింపుల నుంచి కోత విధించి సంస్థ ఖాతాలో చెల్లించేలా డీపీవోలకు అధికారం ఇచ్చారు. బిల్లుల భారం తగ్గించేందుకు ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటు నిర్ణయం బాగున్నా.. వాటి నిర్వహణ బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించడంపై కొందరు సర్పంచులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రమేయం లేకుండానే అధికారులే నేరుగా కోత విధించి సంస్థ ఖాతాలో జమచేయడంతో నిధుల నియంత్రణను కోల్పోవాల్సి వస్తుందని వాపోతున్నారు. గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు కోసం ప్రజలు కార్యదర్శులు, సర్పంచులను సంప్రదిస్తారు. నిర్వహణను ప్రైవేటు సంస్థకు అప్పగిస్తే తమ ఉనికి దెబ్బతింటుందని మరికొందరు ఆందోళన చెందుతున్నారు.

కమిషనర్ కార్యాలయానికి పంపిస్తాంరవికృష్ణ, డీపీఓ


ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని జీపీల్లో సర్పంచుల ద్వారా తీర్మానాలు చేసి పంపించాలని కార్యదర్శులకు సూచించాం. అవి వచ్చిన వెంటనే కమిషనర్ కార్యాలయానికి నివేదికలు పంపిస్తాం.

# నిధుల జాడలేదు.. గండ్లు పూడ్చలేదు..

భైంసా : వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని వివిధ చెరువులకు భారీ నష్టం వాటిల్లింది. కొన్ని చెరువు కట్టలకు గండ్లుపడగా మరి కొన్నింటికి తూములు, అలుగులు, కాల్వలు దెబ్బతిన్నాయి. వాటి కింద పంట పొలాలు బీళ్లుగా మారాయి. నష్టం జరిగి ఎనిమిది నెలలు అవుతోంది. మరమ్మతుల కోసం నీటిపారుదలశాఖ అధికారులు నివేదికలు రూపొందించి నిధుల కోసం ప్రతిపాదించారు. ప్రభుత్వం నేటిక్జీ నిధులు మంజూరు చేయకపోవడం గమనార్హం. పైగా చెరువులకు వచ్చిన నీరు వచ్చినట్లే వృథా అవుతోంది. గత వర్షాకాలంలో జరిగిన పంట నష్టానికి ప్రభుత్వం నేటిక్జీ రూపాయి పరిహారం ఇవ్వలేదు. కట్టకు దిగువన ఉన్న ఆయకట్టు పొలాలు కోతకు గురై పూడ్చుకోలేని నష్టం వాటిల్లుతుందని భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయక, అధికారులు మరమ్మతులు చేపట్టకపోతే వచ్చే వర్షాకాలంలో తాము సాగు చేసిన పంటలకు మరోసారి వరదనష్టం జరిగి చేసిన కష్టం, పెట్టిన పెట్టుబడి అంతా బూడిదలో పోసిన పన్నీరవుతుందంటున్నారు. పలు చెరువులపై ఆధారపడిన మత్స్యకారులకు ఉపాధి కరవు అవుతుంది. ఆ ప్రాంతంలోని నీరు వృథా వర్షాకాలంలో పెంపొందే భూగర్భజల మట్టానికి విఘాతం ఏర్పడి పరిసరాల్లోని బోరుబావులు భవిష్యత్తులో వట్టిపోయే ప్రమాదం పొంచి ఉంటుంది.

అత్యవసర నిధులతో..

ఇది ఇలా ఉంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా స్థాయిలో నీటిపారుదలశాఖ సీఈ, ఎస్ఈ, ఈఈ అత్యవసర నిధుల నుంచి జిల్లా వాటాగా వచ్చిన రూ.66.27లక్షల నిధులతో 29 పనులను తాత్కాలికంగా పూర్తిచేసినట్లు నీటిపారుదలశాఖ అధికారుల చెబుతున్నారు. ప్రభుత్వం ప్రతిపాదిత నిధులు ఇవ్వకపోవడంతో



వాటికి శాశ్వత, ఇతర పనులకు పూర్తిస్థాయిలో ఎప్పుడు మర్మతులు చేపడతారనేది ప్రశ్నార్థకంగా మారింది.

నష్ట నివారణ చర్యలు

రామారావు, ఈఈ, జిల్లా నీటిపారుదలశాఖ, నిర్మల్

జిల్లాలో అత్యవసర నిధులతో కొన్ని చెరువులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాం. భారీ వర్షాలకు చెరువుల కింద జరిగిన నష్టానికి మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదించ్చా. నిధులు రావాల్సి ఉంది. మంజూరు కాగానే పూర్తిస్థాయి పనులను చేపడతాం.

జిల్లాలో చెరువులు : 791

ఆయకట్టు : 53వేల ఎకరాలు

వర్షాలకు దెబ్బతిన్నవి : 125

మరమ్మతుల కోసం ప్రతిపాదించిన నిధులు : రూ.10 కోట్లు

# కేంద్రాల ప్రారంభం సరే... తూకాలేవి?

రుద్రంగి : రుద్రంగి మండల వ్యాప్తంగా ఇరవై రోజుల క్రితం యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే ధాన్యంతో మార్కెట్ యార్డు నిండిపోయింది. మరోవైపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన అధికారులు తూకాలు ప్రారంభించలేదు. ఆకాశంలో కమ్ముకుంటున్న మబ్బులు, కురుస్తున్న చిరుజల్లులు ధాన్యం ఆరబోసిన రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కేంద్రాలకు తీసుకువచ్చి పదిహేను నుంచి ఇరవై రోజులు గడుస్తున్నా తూకం వేయకపోవడంతో అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారు.గత సంవత్సరం యాసంగిలో మండలంలో సుమారు 3,500 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా సుమారు 1.5 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ యాసంగిలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు



చేసేది లేదని ప్రకటించటంతో సాగు విస్తీర్ణం తగ్గింది. ఈ ఏడాది యాసంగిలో కేవలం 2400 ఎకరాలకే పరిమితమైంది. గత ఏడాది ఏప్రిల్ చివరి వారంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగా జూన్ చివరి వారం వరకు కొనసాగింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తొందరగా కొనుగోళ్లను చేపడితేనే జూన్ మొదటి వారం వరకు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. లేదంటే జూన్ చివరి వరకు కొనుగోళ్ల ప్రక్రియ సాగే అవకాశం ఉంటుంది. ఈ యాసంగిలో మండల వ్యాప్తంగా సుమారు 70 నుంచి 80 వేల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా.

వీటిపై దృష్టిసారిస్తే మేలు ధాన్యం తూర్పార పట్టడానికి అవసరమైన యంత్రాలు అందుబాటులో ఉంచాలి. ధాన్యం మిల్లులకు చేరుకున్న తర్వాత తరుగు పేరిట అదనంగా కోత విధించకుండా చూడాలి. లారీలు, గన్నీ సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి. కొనుగోలు కేంద్రాల్లో విద్యుద్దీకరణ, తాగు నీరు, నీడ వసతులు ఏర్పాటు చేయాలి. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే రైతులకు అందిస్తే బాగుంటుంది.

తొందరగా కొనుగోళ్లు చేపట్టాలి : – ఇప్ప మహేశ్, రైతు, రుద్రంగి

నాకున్న నాలుగు ఎకరాల్లో సుమారు 120 క్వింటాళ్ల వరకు ధాన్యం పండించాను. ఆకాశంలో నిత్యం మేఘాలు ఏర్పతున్నందున ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించి వెంటనే తూకాలు వేయాలి. కాంటాలను పూర్తి చేసిన బస్తాలను జాప్యం చేయకుండా మిల్లులకు పంపిస్తేనే తర్వాత ధాన్యం తీసుకు వచ్చే రైతులకు స్థలం దొరుకుతుంది. గతంలో బస్తాలను మిల్లులకు పంపడంలో జాప్యం జరగటం వల్ల బస్తాలు కూడా తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

15 రోజుల కిందట తీసుకొచ్చాను : – లావుడ్య రవి, రైతు, రుద్రంగి

నాకు ఉన్న ఐదు ఎకరాలతో పాటు మరో 12 ఎకరాలను కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. పదిహేను రోజుల క్రితం ధాన్యాన్ని మార్కెట్ యార్డుకు తీసుకువచ్చాను. సుమారు 500 క్వింటాళ్ల ధాన్యాన్ని ఆరబెట్టుకోవటానికి నిత్యం 5 కి.మీ.ల దూరంలో ఉన్న కుక్కలగండి తండా నుంచి కుటుంబ సభ్యులతో కలిసి నిత్యం మార్కెట్ యార్డుకు వచ్చి ఆరబెట్టడం, మేఘాలను చూసి మళ్లీ కుప్పలు చేయాల్సి వస్తోంది.

మూడు, నాలుగు రోజుల్లో ప్రారంభిస్తాం : –శ్రీనివాసరావు, ఏఎంసీ ఛైర్మన్, రుద్రంగి

మూడు, నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తాం. సనుగుల ప్యాక్స్, రుద్రంగి ఏఎంసీలకు కేటాయించిన రైస్ మిల్లుల్లో ఎఫ్‌సీఐ తనిఖీలు జరుగుతున్నాయి. తనిఖీల ప్రక్రియ ముగిసిన తర్వాత కొనుగోళ్లను చేపడతాం.

# హద్దులు చెరిపేసి... ఆక్రమణలకు తెరతీసి...

సిరిసిల్ల : రాజరాజేశ్వర జలాశయం నిర్వాసితులకు ప్రభుత్వం పంపిణీ చేయగా మిగులు స్థలాల రక్షణను పూర్తిగా విస్మరించారు. అవి ఆక్రమణల పాలవుతున్నా వాటిని కాపాడే ప్రయత్నం చేయకపోవడం విచారకరం. నిర్వాసితులు పొందిన ప్లాట్లు, అందులో నిర్మించుకున్న ఇళ్ల నిర్మాణాల క్రయ, విక్రయాలకు అనుమతులిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఇవి అమల్లోకి రావడానికి ఇంకా సమయం పడుతుంది. ఈ లోపు కాలనీల్లో పలుకుబడి కలిగిన వారు హద్దులు చెరిపేసి ఆక్రమణల పర్వానికి తెరతీశారు.రాజరాజేశ్వర జలాశయం నిర్మాణంలో బోయినపల్లి, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల పరిధిలోని 12 గ్రామాల్లో 11,731 మంది నిర్వాసితులను ప్రభుత్వం గుర్తించింది. వీరికి నివాస స్థలాలకు వేములవాడ, బోయినపల్లి, తంగళ్లపల్లి మండలాల పరిధిలో 11 కాలనీలకు 1,171.18 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను సేకరించారు. వీటిలో ఒక్కో నిర్వాసితునికి 242 చదరపు గజాల స్థలాన్ని పట్టాగా అందజేశారు. వీటితోపాటు పంచాయతీ, ఇతర ప్రభుత్వ భవనాలు, మౌలిక వసతులను కల్పించారు. కాగా చాలా కాలనీల్లో నిర్వాసితులకు పంపిణీ చేయగా మిగులు ప్లాట్లు, మరికొన్ని చోట్ల ప్లాట్లుగా చేయని ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో ఇవి అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. నీలోజిపల్లి, కొదురుపాక ఆర్‌అండ్ఆర్ కాలనీల చుట్టూ హద్దులు సుమారు ఐదెకరాల పైనే ఆర్‌అండ్ఆర్ కాలనీలో ఆక్రమణలకు గురయ్యాయి. ఇటీవల కాలనీవాసులు ఆక్రమణలను గుర్తించి ఫిర్యాదు చేయడంతో నిర్మాణాలను అడ్డుకున్నారు. కానీ ఇప్పటికీ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. అలాగే వేములవాడ మండలం పరిధిలోని రుద్రవరం, అనుపురం, కొడుముంజ కాలనీల సమీపంలో ప్రైవేటు వెంచర్లతో రిజిస్ట్రేషన్లు జరిగాయి. రెవెన్యూ అధికారులకు తెలిసినా వీటిని నిలువరించలేదు. ఇప్పటికీ చాలా కాలనీల్లో హద్దులు లేవు.చర్యలు తీసుకుంటాం : – శ్రీనివాసరావు, ఆర్డీవో, సిరిసిల్ల

ఖాళీ ప్లాట్ల ఆక్రమణలు, కబ్జాలు ఆయా మండలాల పరిధిలోని రెవెన్యూశాఖ దృష్టిలో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ల అనుమతులకు ముందే పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలించి కాలనీల చుట్టూ హద్దులు ఏర్పాటుపై పరిశీలిస్తాం.

హద్దులు ఏర్పాటు చేస్తేనే...నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్ల క్రయ, విక్రయాలకు గత నెల రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పట్టాలు పొంది, ఇళ్ల నిర్మాణం చేసుకున్నవారికి అవకాశం ఉంటుంది. నిర్వాసితులకు కేటాయించక ఖాళీగా ఉన్న ప్లాట్లు పూర్తిగా రెవెనూ ఆధీనంలోనే ఉంటాయి. రిజిస్ట్రేషన్ శాఖకు ఉత్తర్వులు పంపించే క్రమంలో కాలనీల వారీగా ఖాళీ ప్లాట్ల వివరాలు రిజిస్ట్రేషన్లకు అనుమతి లేకుండా చర్యలు తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో ఖాళీ ప్లాట్ల వివరాలు తెలుపుతూ ఇవి ప్రభుత్వ ఆధీనంలోని అని బోర్డులను ఏర్పాటు చేయాలి. వేములవాడ, బోయినపల్లి మండలాల పరిధిలోని ఆర్‌అండ్ఆర్ కాలనీలు సిరిసిల్ల–కరీంనగర్ రహదారిని ఆనుకుని ఉన్నాయి. ఇక్కడ గజం స్థలం వేలల్లో పలుకుతోంది.



# వైకాపాకు, ఎమ్మెల్యే పదవికి ఆర్కే రాజీనామా

అమరావతి: వైకాపాకు గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తన పదవికి రాజీనామా చేశారు. వైకాపా సభ్యత్వానికీ రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే పదవికి స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేసిన ఆర్కే.. స్పీకర్ కార్యాలయానికి వెళ్లి సభాపతి కార్యదర్శికి ఆ లేఖను అందజేశారు. మంగళగిరి వైకాపా ఇన్‌ఛార్జ్‌గా గంజి చిరంజీవికి ఆ పార్టీ బాధ్యతలు అప్పగించింది. ఈ నేపథ్యంలోనే ఆర్కే అసంతృప్తికి గురై రాజీనామా చేసినట్లు సమాచారం. రాజీనామా అనంతరం ఆర్కే మీడియాతో మాట్లాడారు. "ఎమ్మెల్యే పదవికి, వైకాపాకు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశా. స్పీకర్ కార్యాలయంలో లేఖను అందజేశాను. దీన్ని ఆమోదించాలని స్పీకర్‌ను కోరా. రాజీనామాకు గల కారణాలను త్వరలో తెలియజేస్తా"అని ఆయన చెప్పారు.



# నాడు నల్లడబ్బుపై ట్వీట్ చేసి.. నేడు నోట్లగుట్టలతో చిక్కి..!

దిల్లీ: ఒడిశా ప్రధాన కేంద్రంగా కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహు కుటుంబం నిర్వహిస్తున్న డిస్టిలరీ కంపెనీపై ఆదాయపు పన్ను విభాగం అధికారులు నిర్వహించిన దాడుల్లో రూ.వందల కోట్లు బయటపడ్డాయి. ఐదురోజులుగా 50 మంది బ్యాంకు అధికారులు 40 కౌంటింగ్ మెషిన్లతో ఆ నోట్ల గుట్టలను లెక్కించగా.. ఇప్పటివరకు రూ.353 కోట్ల లెక్క తేలిందని మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఓ దర్యాప్తు సంస్థ చేపట్టిన సోదాల్లో ఇంత పెద్ద మొత్తంలో నగదు పట్టుబడటం దేశంలో ఇదే తొలిసారి. దీనిపై భాజపా తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆధ్వర్యంలో పార్లమెంట్ బయట పార్టీ ఎంపీలు నిరసన చేపట్టారు. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వివరణ ఇవ్వాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. జేపీ నడ్డా మీడియాతో మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, కరప్షన్ ఒకే నాణానికి రెండు ముఖాలు లాంటివి. ధీరజ్ సాహు వద్ద దొరికిన ఈ నల్లడబ్బు ఎవరిది..? దీనిపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సమాధానం ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. భారీ స్థాయిలో నగదు వెలుగులోకి రావడంపై కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒక ఎంపీ ఇంటినుంచి ఈ స్థాయిలో నగదును స్వాధీనం చేసుకున్నారు. కానీ దీనిపై ప్రతిపక్షాల ఇండియా కూటమి మాత్రం మౌనం వహిస్తోంది. కరప్షన్ అనేది కాంగ్రెస్ స్వభావం కాబట్టి ఆ పార్టీ నిశ్శబ్దంగా ఉందంటే ఓకే. జేడీయూ, ఆర్జేడీ, డీఎంకే, ఎస్పీ ఎందుకు మౌనం వహిస్తున్నాయి' అని ఇండియా కూటమిపై విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం ఈ కౌంటింగ్ దాదాపుగా పూర్తికావొచ్చిందని ఐటీ శాఖ అధికారులు తెలిపారు.

బాలంగిర్‌లోని ఎస్‌బీఐ శాఖలో ఈ మొత్తాన్ని డిపాజిట్ చేయనున్నారు. 'మొత్తం 176 బ్యాగుల్లో 140కి పైగా బ్యాగుల్లోని నగదు కౌంటింగ్ పూర్తయింది. మిగిలిన నగదును ఈ రోజు లెక్కిస్తాం' అని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ తెలిపారు.

**కుంగిపోలేదు.. కెరటంలా లేచాడు :** ఇదిలా ఉంటే.. గతంలో అవినీతికి వ్యతిరేకంగా ధీరజ్ చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. 'డీమానిటైజేషన్ తర్వాత కూడా దేశంలో నల్లధనం, అవినీతిని చూస్తుంటే నా హృదయం బరువెక్కుతోంది.

అంత నల్లడబ్బు ఎలా ఒకదగ్గర పోగుపడుతుందో నాకర్థం కావడం లేదు. ఈ దేశంలో అవినీతిని పారదోలేది కాంగ్రెస్ మాత్రమే' అని అప్పట్లో ఆయన ట్వీట్ చేశారు. ఈ కాంగ్రెస్ ఎంపీ పోస్టును భాజపా నేత అమిత్ మాలవీయ రీట్వీట్ చేశారు. 'ధీరజ్ ప్రసాద్ సాహుకు మంచి హాస్య చతురత ఉంది' అని ఎద్దేవా చేశారు.

# టీచర్ మల్లేష్‌కు పరిటాల సునీత ఆర్థిక సాయం





అనంతపురం: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు మల్లేష్‌కు మాజీ మంత్రి పరిటాల సునీత ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం ఉదయం మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లెరఘునాథ్ రెడ్డి ప్రభుత్వాస్పత్రికి వెళ్లి టీచర్ మల్లేష్‌ను పరామర్శించారు. ఉపాధ్యాయుడు మల్లేష్ కుటుంబ సభ్యులకు సునీత ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మల్లేష్‌కు పరిటాల సునీత రూ.50వేల ఆర్థిక సాయం ప్రకటించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ.. వారంలోగా సీపీఎస్ రద్దు చేస్తానన్నారు ఏమైందని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు భయపడి ఎన్నికల విధులకు కూడా దూరం చేస్తున్నారన్నారు. చదువు చెప్పే ఉపాధ్యాయులతో చేయరాని పనులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వ పతనానికి ఇక ఎన్నో రోజులు లేవని హెచ్చరించారు. ప్రజలకు సేవ చేసే ఉద్యోగులను ఆత్మహత్యలు చేసుకునే వరకు తీసుకొచ్చారన్నారు. ఉపాధ్యాయుడు మల్లేష్ ఆత్మహత్యాయత్నంపై రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అనుచరులు దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోన్‌యాప్స్ వల్లే మల్లేష్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని వైసీపీ సోషల్ మీడియా ద్వారా అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడానికి రాప్తాడు ఎమ్మెల్యే టీమ్‌లనే పెట్టుకున్నారన్నారు. దుష్ప్రచారాలు చేయడానికి సోషల్ మీడియా టీంలకు హైదరాబాదులో ట్రైనింగ్ ఇప్పించారన్నారు. "మల్లేష్ ఆత్మహత్యకు సరైన కారణాలు తెలుసుకోని మాట్లాడు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి. నువ్వు లోన్స్ తీసుకున్నావ్ కదా ప్రకాష్ రెడ్డి.. నువ్వేమైనా ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించావా..? మీరు, మీ వైసీపీ నాయకులు దోచుకున్న సొమ్ముతో సంతృప్తిగా ఉన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు,పింఛనర్లు అప్పుల పాలవుతున్నారు. మల్లేష్‌కు ఏమైనా జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారు" అంటూ పరిటాల సునీత ప్రశ్నించారు.



# ఆర్టికల్ 370 రద్దు.. రాజ్యాంగబద్ధమే

దిల్లీ: జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన రాజ్యాంగంలోని 'ఆర్టికల్ 370' రద్దు రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగబద్ధమే అని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. ఈ అంశంపై పిటిషనర్ల వాదనను తోసిపుచ్చిన రాజ్యాంగ ధర్మాసనం.. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది. "జమ్మూకశ్మీర్ పై కేంద్రం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని సవాల్ చేయలేరు. భారత్‌లో విలీనం తర్వాత జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక సార్వభౌమాధికారం లేదు. అప్పట్లో యుద్ధ పరిస్థితుల దృష్ట్యా ఆర్టికల్ 370ని ప్రవేశపెట్టారు. అది తాత్కాలిక ఏర్పాటు మాత్రమే గానీ.. శాశ్వతం కాదు. దాన్ని రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది. హక్కుల విషయంలో జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేకత ఏమీ లేదు. మిగతా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో అది సమానమే. ఆర్టికల్ 1, ఆర్టికల్ 370 ప్రకారం జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే" అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ తీర్పును వెలువరించారు.

**అప్పటిలోగా ఎన్నికలు నిర్వహించాలి..** ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్ నుంచి లద్దాఖ్‌ను విభజించి దాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించడాన్ని కూడా సుప్రీంకోర్టు సమర్థించింది.

అయితే, ప్రస్తుతం కేంద్రపాలిత ప్రాంతంగా ఉన్న జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రహోదాను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. 2024 సెప్టెంబరు 30వ తేదీలోగా జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేలా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలని ఆదేశించింది.

**మానవహక్కుల ఉల్లంఘనలపై దర్యాప్తు జరగాలి :** ఆర్టికల్ 370 రద్దు అంశంపై రాజ్యాంగ ధర్మాసనం మొత్తం మూడు తీర్పులు వెలువరించింది. సీజేఐ చంద్రచూడ్, జస్టిస్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ కలిసి ఒక తీర్పు వెలువరించగా.. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా మరో రెండు తీర్పులను వెల్లడించారు. ఈ సందర్భంగా జస్టిస్ కౌల్ తన తీర్పును వెలువరిస్తూ.. జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకున్న మానవహక్కుల ఉల్లంఘనలపై దర్యాప్తు జరగాలని అన్నారు. ఇందుకోసం ఓ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. 1980 నుంచి జమ్మూకశ్మీర్‌లో జరుగుతున్న మానవహక్కుల ఉల్లంఘనలు, హింసాత్మక ఘటనలపై ఈ కమిషన్ దర్యాప్తు చేపట్టాలని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హెూదాను కల్పించే 370 ఆర్టికల్‌ను కేంద్రం 2019 ఆగస్టు 5న రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జమ్మూకశ్మీర్‌కు చెందిన పలు పార్టీలు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. వాటిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ ఏడాది ఆగస్టు 2 నుంచి సుదీర్ఘంగా విచారణ జరిపింది. సెప్టెంబరు 5న తన తీర్పును రిజర్వులో ఉంచింది. తాజాగా సోమవారం ఆ తీర్పును వెలువరించింది.





# కార్తికమాస చివరి సోమవారం.. శైవక్షేత్రాల్లో రద్దీ

కార్తికమాసం చివరి సోమవారం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. శ్రీశైలం, వేములవాడతో పాటు ప్రధానాలయాలకు వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణా, గోదావరి నదుల్లో పుణ్యస్నానాలు చేశారు. దీంతో విజయవాడలోని దుర్గా ఘాట్ వద్ద రద్దీ నెలకొంది. రాజమహేంద్రవరం, భద్రాచలంలో గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. దీపాలను వెలిగించి నదుల్లో వదిలారు.

# విశాఖ నోవాటెల్ హెూటల్ వద్ద నాదెండ్ల మనోహర్ అరెస్టు



అమరావతి: జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విశాఖలోని టైకూన్ కూడలి నుంచి వీఐపీ రోడ్డు వైపు వెళ్లే మార్గాన్ని మూసివేయడంపై జనసేన ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు ఈరోజు ఆందోళనకు దిగారు. దీనికి మద్దతుగా నోవాటెల్ హెూటల్ వద్ద నాదెండ్ల ఆందోళనకు దిగారు. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు నోవాటెల్ హెూటల్ వద్ద నాదెండ్ల మీడియాతో మాట్లాడారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు లేదా అని ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే చర్యలు మానుకోవాలని వైకాపా ప్రభుత్వానికి సూచించారు.

"వీఐపీ రోడ్డు వైపు వెళ్లే మార్గాన్ని మూసివేయడం వల్ల ప్రయాణికులు సుమారు 2 కి.మీ మేర అదనపు దూరం వెళ్లాల్సి వస్తుంది. విశాఖ ఎంపీ నిర్మిస్తున్న బిల్డింగ్ సేల్స్ పెంచుకోవడం కోసం ప్రజలను ఇబ్బందికి గురిచేస్తున్నారు. వాస్తు దోషం తొలగించుకోవడానికి రోడ్లు మూసివేయడం అన్యాయం. పోలీసు ఉన్నతాధికారులు ఆలోచన చేయాలి. డివైడర్ తొలిగించే వరకు జనసేన పోరాడుతుంది. ఈ ప్రభుత్వానికి ఇంకా మూడు నెలలు మాత్రమే గడువు మిగిలి ఉంది" అని నాదెండ్ల వ్యాఖ్యానించారు.

# 'ఇస్తాం.. చేస్తాం.. తెస్తాం.. జగనన్న ఎగ్గొట్టిన హామీల లిస్ట్ ఇదీ..'



విశాఖపట్నం: "ఇస్తాం.. చేస్తాం.. తెస్తాం.. కడతాం.." అని చెప్పడం తప్ప సీఎం జగన్ చేసిందేమీ లేదని తెదేపా ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. జగన్ మాట తప్పి మడమ తిప్పారని.. హామీలు ఎగ్గొట్టారని విమర్శించారు. వైకాపా అధికారంలోకి వచ్చి 4 సంవత్సరాల 9 నెలలు పూర్తయిన సందర్భంగా 'జగనన్న ఎగ్గొట్టిన హామీల లిస్టు' పేరుతో ఆ జాబితాను గంటా శ్రీనివాస రావు ట్విటర్ (ఎక్స్) వేదికగా పోస్ట్ చేశారు. వీటిలో సీపీఎస్ రద్దు, ప్రత్యేక హెూదా, పోలవరం పూర్తి చేయడం తదితర ముఖ్య హామీలు ఉన్నాయి. ఇవి టాప్ 50 మాత్రమేనని.. ప్రాముఖ్యత తక్కువ ఉన్న హామీలను బయటకు తీస్తే ఈ జాబితాకు మరో మూడింతలు అవుతుందన్నారు. "మీ ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ అమలు చేయడంలో చతికిలపడింది. మీరు చెప్పిన సంక్షేమం సంక్షోభంలో పడింది. మీ అరాచక ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఈ సారి మీరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు మోసపోవడానికి సిద్ధంగా లేరు. మీ ప్రభుత్వానికి దుకాణం సర్దుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయని గుర్తుంచుకోండి జగన్ మోహన్‌రెడ్డి గారు.. బై జగన్... బై బై జగన్.." అంటూ గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# పారదర్శకంగా నాటక రంగ నంది అవార్డుల ఎంపిక: పోసాని



అమరావతి: ఈ నెల 23న నాటక రంగ నంది అవార్డులు అందిస్తున్నామని ఏపీఎఫ్‌డీసీ ఛైర్మన్ పోసాని కృష్ణమురళీ వెల్లడించారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పూర్తి పారదర్శకంగా అవార్డుల ఎంపిక చేపడుతున్నామన్నారు. ప్రముఖ నాటకరంగ వ్యక్తులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. నంది అవార్డుల కోసం 115 దరఖాస్తులు వచ్చాయి. అందులో 38 మందిని ఎంపిక చేశారు. 5 కేటగిరీలలో మొత్తం 74 అవార్డులు ఇస్తాం. ఎమ్మెల్యే, ఎంపీల సిఫార్సులకు తావులేదు" అని పోసాని స్పష్టం చేశారు.

# చంద్రబాబు-పవన్ జోడీ బ్లాక్ బస్టర్: లోకేశ



తుని: తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌ల జోడీ బ్లాక్‌బస్టర్ అని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా తునిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యేతో కుమ్మక్కై అవినీతికి పాల్పడిన అధికారులను వదిలిపెట్టబోనని హెచ్చరించారు. అవినీతికి పాల్పడిన ఉద్యోగులను డిస్మిస్ చేసి జైలుకు పంపుతామని అన్నారు. తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేషన్ ద్వారా కాపులను పేదరికం నుంచి బయటపడేలా చేస్తానని నారా లోకేశ్ హామీ ఇచ్చారు. "కాపు రిజర్వేషన్ల కోసం మంత్రి రాజాను నిలదీయండి. బీసీలకు ఇబ్బంది లేకుండా కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి 5 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెదేపా కట్టుబడి ఉంది. కాకినాడ సెజ్‌లో కాలుష్యం లేని పరిశ్రమలను ఏర్పాటు చేస్తాం. స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తాం " అని నారా లోకేశ్ అన్నారు.

# త్రిష్ టైప్ లో పూజా హెగ్డే కూడా !

టాలీవుడ్ బుట్ట బొమ్మగా మొన్నటి వరకు చాలా స్టార్ హెూదాతో మెరిసిపోయిన పూజా హెగ్డే ప్రస్తుతం మాత్రం అంతగా గుర్తింపునందుకోవడం లేదు. ఆమెకు ఇటీవల కాలంలో వచ్చిన డిజాస్టర్లు కెరీర్ పై గట్టి ప్రభావం అయితే చూపిస్తున్నట్లుగా అనిపిస్తుంది. పూజా హెగ్డే మొదట్లో కూడా కొన్ని పరాజయాలు ఎదురయ్యాయి కానీ వాటి నుంచి ఆమె తొందరగానే బయటపడింది. ఎప్పుడైతే అల్లు అర్జున్ తో డీజే దువ్వాడ జగన్నాథం అనే సినిమా చేసిందో అప్పటినుంచి ఆమె కెరీర్ ఒక్కసారిగా ఊపందుకుంది. ఆ తర్వాత త్రివిక్రమ్ సినిమాలతో కూడా రేంజ్ పెరిగిపోయింది. వెంట వెంటనే ప్రభాస్ రామ్ చరణ్ ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోలతో ఆమె సినిమా చేసే అవకాశాలు అందుకుంది. అయితే ఇప్పుడు మాత్రం ఆ రేంజ్ హీరోలతో ఆమెకు అవకాశాలు రావడం లేదు. రాదేశామ్ ఆచార్య లాంటి డిజాస్టర్ సినిమాలు కూడా గట్టిగానే దెబ్బ కొట్టాయి. ముఖ్యంగా బాలీవుడ్లో సల్మాన్ తో చేసిన కిసీ కా భాయ్ కిసీ కి జాన్ సినిమా కూడా ఊహించని రేంజ్ లో ఫ్లాప్ అయ్యింది. ఇక ఆ తర్వాత అమ్మడికి టాలీవుడ్ ఇండస్ట్రీలో అనుకున్నంత స్థాయిలో అయితే అవకాశాలు



రావడం లేదు. ప్రస్తుతం ఆమె చేతిలో బాలీవుడ్ లోనే కాస్త చెప్పుకోదగ్గ సినిమాలు ఉన్నాయి. అక్కడ షాహిద్ కపూర్ రన్వీర్ లాంటి హీరోలతో సినిమాలు చేస్తోంది. ఇక తెలుగులో అయితే ఆఫీషియల్ గా ఓకే అయిన ఒకే ఒక్క సినిమా సాయిధరమ్ తేజ్ గాంజా శంకర్. అలాగే రవితేజ హరిష్ శంకర్ సినిమాకు కూడా ఈ బ్యూటీ ని అనుకుంటున్నప్పటికీ ఇంకా ఆ విషయంలో క్లారిటీ అయితే రాలేదు. ఇక గాంజా శంకర్ కూడా స్టార్ట్ కావడానికి చాలా సమయం పడుతుంది. ఏది ఏమైనప్పటికీ చేతిలో ఎన్ని సినిమాలు ఉన్నప్పటికీ కూడా పూజ పాప స్టార్ ఇమేజ్ అంతగా వెలిగిపోవడం లేదు. కాబట్టి ఇప్పుడు ఆమెకు సరైన సక్సెస్ అయితే ఒకటి పడాలి. చేతిలో ఉన్న సినిమాలలో ఏది సక్సెస్ అయినా కూడా కొంత పాజిటివ్ వైబ్రేషన్స్ క్రియేట్ అయ్యే అవకాశం ఉంటుంది. త్రిష లాంటి హీరోయిన్స్ కూడా కెరీర్ ముగిసిపోయింది అని అనుకున్న సమయంలో మళ్ళీ ఒక్కసారిగా బౌన్స్ బ్యాక్ అవుతున్నారు. ఇక పూజకు అంత వయసు కూడా పెరిగిపోలేదు కాబట్టి మంచి కంటెంట్ ఉన్న కొన్ని చిన్న సినిమాలు చేస్తే కూడా ఆమె కెరీర్ మళ్లీ ట్రాక్ లోకి వచ్చే అవకాశం ఉంటుంది. చూడాలి మరి ఆమె సెలక్షన్ ఎలా ఉంటుందో.

## బన్నీ మాస్టర్ ప్లాన్.. ఈసారి బాలీవుడ్ లో..

ప్రస్తుతం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప 2 సినిమాతో బిజీగా ఉన్నారు. కంటిన్యూలో షూటింగ్ లో పాల్గొంటున్నారు. ఈ సినిమా నుంచి వచ్చిన టీజర్ ఇప్పటికే తెగ ఆకట్టుకుంది. పుష్ప మూవీ హిట్‌తో పుష్ప 2పై భారీ అంచనాలు నెలకొన్నాయి. బన్నీ అభిమానులంతా ఈ సినిమా కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు. అందుకే నటీనటుల నుంచి సన్నివేశాలు, ఐటమ్ సాంగ్ వరకు చాలా పక్కాగా తెరకెక్కిస్తున్నారు లెక్కల మాస్టర్ సుకుమార్. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో పుష్ప 2 మూవీ షూటింగ్ శరవగేంగా జరుగుతోంది. అక్కడ కొన్ని కీలకమైన సన్నివేశాలను అనేక రోజులు నుంచి చిత్రీకరిస్తున్నారు. ఇప్పటికే గంగమ్మ జాతర నేపథ్యంలో సాగే ఓ పాటను సుమారు వెయ్యి మంది డ్యాన్సర్లతో



మేకర్స్ చిత్రీకరించినట్లు సమాచారం. ఈ పాటతో పాటు అక్కడ భారీ యాక్షన్ సీన్స్ కూడా చిత్రీకరించినట్లు సినీ వర్గాలు తెలిపాయి. అయితే ఈ సినిమా తర్వాత మరో స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ తో సినిమా చేయనున్నారు బన్నీ. ఆ తర్వాత యానిమల్ లో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకున్న దర్శకుడు సందీప్ రెడ్డి వంగాతో కూడా మూవీ తీయనున్నారు. ఈ సినిమాను బీటౌన్ ప్రముఖ నిర్మాణ సంస్థ టీ- సిరీస్ తెరకెక్కించనుంది. ఇప్పుడు నెట్టింట మరో వార్త చక్కర్లు కొడుతోంది. బాలీవుడ్ కు చెందిన మరో ప్రముఖ నిర్మాణ సంస్థతో అల్లు అర్జున్ చర్చలు జరుపుతున్నారట. భారీ ప్రాజెక్ట్ కు ప్లాన్ చేస్తున్నారట. ప్రొడక్షన్ హౌస్ గురించి వివరాలు బయటకు రాకపోయినా.. చర్చలు జరపడం మాత్రం నిజమేనని నెటిజన్లు చెబుతున్నారు. దీని ప్రకారం చూస్తుంటే బన్నీ పెద్ద ప్లానే వేశారన్నమాట. కొన్ని నెలల క్రితం సంజయ్ లీలా బన్సాలీ కార్యాలయం నుండి అల్లు అర్జున్ బయటకు రావడం అప్పట్లో తెగ వైరలైంది. ఇప్పుడు దానికి దీనికి కనెక్ట్ చేస్తున్నారు నెటిజన్లు. పుష్ప తర్వాత పెద్ద ప్రాజెక్ట్ కు బన్నీ ఓకే చేశారంటూ పోస్టులు పెడుతున్నారు. అయితే ఇదంతా ఎంతవరకు నిజమో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు ఆగాల్సిందే.




# భారీ బడ్జెట్‌తో వచ్చిన సాంగ్స్.. టాప్-5 ఇవే!



సాధారణంగా మేకర్స్ కొన్నిసార్లు తమ సినిమాల్లోని పాటలను షూట్ చేయడం కోసం వేరే దేశాలు లేదా ఇతర ప్రదేశాలకు వెళ్తూ ఉంటారు. మరికొన్ని సార్లు భారీ సెట్లు వేసి అందులోనే చిత్రీకరిస్తుంటారు. అందుకు పెద్ద మొత్తంలో ఖర్చు కూడా చేస్తుంటారు. ఇంకొన్నిసార్లు అందమైన ప్రకృతి ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి షూట్ చేస్తుంటారు. అయితే టాలీవుడ్ సినిమాల్లో పాటలను చిత్రీకరించడం కోసం ఏకంగా కొన్ని కోట్ల రూపాయలే ఖర్చు పెట్టారట. ఆ జాబితాలో ఉన్న టాప్-5 పాటలేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన అలా వైకుంఠపురం సినిమాలోని రాములో రాముల పాటకు మేకర్స్ ఏకంగా రూ.1.2 కోట్లు ఖర్చు చేశారట. ఈ పాటను స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ కంపోజ్ చేశారు. చాలా నెలలపాటు ఈ పాట ఫుల్ ట్రెండింగ్‌లో ఉంది. అనేక శుభకార్యాలు, కాలేజీ ఫంక్షన్లలో డ్యాన్స్ వేయాలంటే ఈ పాట ఉండాల్సిందే. బన్నీ నటించిన మరో చిత్రం నా పేరు సూర్య నా ఇల్లు ఇండియాలోని ఇరగ ఇరగ సాంగ్ షూట్ చేయడానికి మేకర్స్? రూ.1.5 కోట్ల ఖర్చు చేశారట.విశాల్, శేఖర్ కాంబో ఈ పాటకు బాణీలు అందించింది. రాహుల్ సిప్లిగంజ్ మాస్ వాయిస్‌తో ఈ పాటకు ప్రాణం పోశారు. మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ నటించిన సూపర్ హిట్ మూవీ రంగస్థలంలోని రంగమ్మ మంగమ్మ అప్పట్లో దుమ్ముదులిపేసింది. ఆ పాటను చిత్రీకరించడానికి రెండు కోట్ల రూపాయలు ఖర్చు చేశారట. ఈ సాంగ్‌ను మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్ కంపోజ్ చేయగా.. సమంత తన ఎక్స్‌ప్రెషన్స్‌తో అదరగొట్టేసింది. మహేశ్ బాబు నటించిన భరత్ అనే నేను సినిమాలోని వచ్చాడయ్యో స్వామీ పాటకు ఏకంగా రూ.2.5 కోట్లు ఖర్చు చేశారట. ఈ పాటలోని బ్యాక్ గ్రౌండ్స్ సెట్స్ కోసం భారీగా ఖర్చు పెట్టారట. వందల మంది డ్యాన్సర్ల మధ్య మహేశ్ పంచెకట్టులో సింపుల్ స్టెప్స్‌తో అదరగొట్టేశారు.

ఈ పాటను కూడా దేవిశ్రీనే కంపోజ్ చేశారు. ఇక టాలీవుడ్ ఇండస్ట్రీలోనే భారీ బడ్జెట్‌తో నిర్మించిన వాటిలో టాప్ వన్‌లో ఉంది బాహుబలి సినిమాలోని సాహెూరే బాహుబలి సాంగ్. కీరవాణి కంపోజ్ చేసిన ఈ పాట కోసం ఏకంగా రూ.5 కోట్లు ఖర్చు చేశారట. వందలాది మంది డాన్సర్లతో ఈ పాటను భారీగా చిత్రీకరించారు. మరోవైపు, రామ్‌చరణ్ నటిస్తున్న గేమ్‌ఛేంజర్ మూవీలోని జరగండి సాంగ్‌కు ఏకంగా రూ.15 కోట్ల ఖర్చు చేసినట్లు సమాచారం.

# నాని..వెంటనే మరొకటి!




నాచురల్ స్టార్ నాని నటించిన హాయ్ నాన్న ప్రస్తుతం థియేటర్స్ లో సందడి చేస్తోంది. డిసెంబర్ 7న విడుదలైన ఈ చిత్రం ఆడియన్స్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ సొంతం చేసుకుంది. మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటించిన ఈ సినిమాని శౌర్యువ్ అనే డెబ్యూ డైరెక్టర్ తెరకెక్కించారు. ఫాదర్ అండ్ డాటర్ సెంటిమెంట్ తో ఎమోషనల్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్ ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ఓవర్సీస్ ఫ్యామిలీ ఆడియన్స్ ఈ సినిమాకి భారీ ఆదరణ కనబరుస్తున్నారు. ఈ క్రమంలోనే మూవీ ప్రమోషన్ కోసం నాని అమెరికా వెళ్లారు. ఇదిలా ఉంటే ఈ మూవీ తర్వాత నాని వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో 'సరిపోదా శనివారం' అనే సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. నాని సరసన మలయాళ బ్యూటీ ప్రియాంక అరుణ్ మోహన్ హీరోయిన్ గా నటిస్తోంది. గతంలో వీరిద్దరూ కలిసి 'గ్యాంగ్ లీడర్' అనే సినిమాలో నటించారు. ఇప్పుడు మరోసారి 'సరిపోదా శనివారం' మూవీతో ఆడియన్స్ ముందుకు రాబోతున్నారు.కోలీవుడ్ అగ్ర నటుడు SJ సూర్య కీలక పాత్ర పోషిస్తున్న ఈ సినిమాకి సంబంధించి ఇటీవల రిలీజైన గ్లిమ్స్ వీడియో సినిమాపై అంచనాలు భారీగా పెంచేసింది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాకి సంబంధించి అదిరిపోయే అప్డేట్ అందించారు నాని. తన లేటెస్ట్ మూవీ హాయ్ నాన్న ప్రమోషన్ లో భాగంగా అమెరికా వెళ్ళిన నాని అక్కడి వాళ్లతో మాట్లాడుతూ.. 'సరిపోదా శనివారం మూవీని వచ్చే ఏడాది ఆగస్టు నెలలో రిలీజ్ కి రెడీ చేస్తున్నట్లు' చెప్పుకొచ్చాడు. కాగా వచ్చే ఏడాది ఆగస్టు 15న 'పుష్ప 2' రిలీజ్ కాబోతోంది. పుష్ప 2 రిలీజైన రెండు వారాలకి నాని 'సరిపోదా శనివారం' మూవీని విడుదల చేసేందుకు మూవీని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. త్వరలోనే మేకర్స్ నుంచి ఇందుకు సంబంధించి అధికారిక ప్రకటన రానుంది.

కాగా ఈ సినిమాలో నాని రగుడ్ లుక్ లో కనిపించనున్నాడు. గతంలో నాని - వివేక్ ఆత్రేయ కాంబినేషన్లో ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా వచ్చిన 'అంటే సుందరానికి' మూవీ పరాజయం పాలయింది. దాంతో ఈసారి యాక్షన్ ఎంటర్టైనర్ తో రాబోతున్నారు. ఈ మూవీలో నానిని వివేక్ ఆత్రేయ కంప్లీట్ మాస్ యాక్షన్ అవతార్ లో ప్రజెంట్ చేయబోతున్నాడు. జేక్స్ బీజాయ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాని DVV ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై DVV దానయ్యా, కళ్యాణ్ దాసరి భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు.

# వావ్ శ్రియా చీర కట్టులో మళ్లీ అదుర్స్

సీనియర్ హీరోయిన్ శ్రియా సరన్ నాలుగు పదుల వయసులోనూ పాతికేళ పడుచు అమ్మాయి మాదిరిగా చాలా అందంగా కనిపిస్తోందని అభిమానులు సోషల్ మీడియాలోని ఆమె ప్రతి ఫోటో షూట్ కి కామెంట్స్ చేస్తూ ఉంటారు. తాజాగా శ్రియా మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. గతంలో పలు సార్లు చీర కట్టి నడుము అందాన్ని చూపిస్తూ, కుర్రకారుని ఉర్రూతలూగించిన శ్రియా మరోసారి చీర కట్టి అంతా నోరు వెళ్లబెట్టి మరీ చూసే విధంగా చేసింది. ఈ సరికొత్త



చీర కట్టు ఫోటోలతో శ్రియా మళ్లీ కూడా అదుర్స్ అనిపించుకుంది. అంతే కాకుండా ఈ అమ్మడి చీర కట్టు ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం ఇండస్ట్రీలో ఇష్టం అంటూ అడుగు పెట్టిన శ్రియా అప్పటి నుంచి తన ప్రతి సినిమా కి కూడా న్యాయం చేస్తూ అందంగా కనిపిస్తూనే నటనతో మెప్పిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గత కొన్నాళ్లుగా హీరోయిన్ గా వరుసగా ఆఫర్లు రాకున్నా కూడా వచ్చిన ప్రతి ఆఫర్ ని సద్వినియోగం చేసుకుంటోంది పెళ్లి అయ్యి, అమ్మగా మారిన తర్వాత కూడా శ్రియా నటనకు, ఇండస్ట్రీకి దూరం అవ్వడం లేదు.

ఆమె ఇంకా నటన పై ఆసక్తితో సినిమాలు చేస్తూనే ఉంది. ప్రస్తుతం ఆమె చేతిలో అన్ని భాషలకు సంబంధించిన సినిమాలు ఉన్నాయి. వాటిల్లో చిన్న పాత్రే అయినా కూడా కచ్చితంగా శ్రియా మార్క్ ఉండే విధంగా ఆమె అందంగా కనిపించడంతో పాటు మంచి నటనతో మెప్పిస్తుందని ఫ్యాన్స్ నమ్మకంతో ఉన్నారు.

## నల్లకోటు పక్కనబెట్టి మోడ్రన్ దుస్తుల్లో లాయరమ్మ!

డాక్టర్ కాబోయ్ యాక్టర్లు అయినా వాళ్లెంతో మంది. కానీ లాయర్ కాబోయి యాక్టర్ అయిన నటి మాత్రం ఈవిడే. అవును ఈ అమ్మడు నటికంటే ముందు లాయర్ పట్టా సంపాదించింది. కొన్నాళ్ల పాటు ప్రాక్టీస్ అనంతరం నల్లకోటును పక్కనబెట్టి మోడ్రన్ దుస్తుల్లో మెరవడం మొదలు పెట్టింది. అప్పటి నుంచి ఆ దుస్తుల్లోనే అభిమానుల్ని అలరిస్తుంది. ఇంతకీ ఎవరాభామ? అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే. 'జెర్సీ'తో టాలీవుడ్ కి పరిచయమైన శ్రద్ధా శ్రీనాద్ సుపరిచితమే. అమ్మడికి తొలి సినిమాలోనే నటనకు ఆస్కారం ఉన్న పాత్రలో కనిపించి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. తాజాగా ఈ బ్యూటీ గురించి మరిన్ని విశేషాలు...ఆమె మాటల్లోనే.. 'మాది మైసూర్..అమ్మ టీచర..నాన్న ఆర్మీ ఉద్యోగి. నాన్న జాబ్ రీత్యా దేశంలో చాలా రాష్ట్రాలు



తిరిగాం. ఏడవ తరగతి నుంచి పదవతరగతి వరకూ సికింద్రా బాద్ లోనే చదువుకున్నా. ఇంటర్మీడియట్ సమయానికి బెంగుళూరు వెళ్లిపోయాను. అక్కడ బెంగుళూరు ఇనిస్ట్యూట్ ఆఫ్ లీగల్ స్టడీస్ లో ఎల్ ఎల్ బీ చదివా. తర్వాత కొన్నాళ్ల పాటు కార్పోరేట్ లాయర్ గా పనిచేసాను. ఎల్ ఎల్ బీ చదువుతున్న సమయంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో..నాటకాల్లో పాల్గొనే దాన్ని. చాలా మంది మెచ్చుకోవడంతో నా నటనపై నమ్మకం ఎక్కువైంది. ఆ తర్వాత థియేటర్ గ్రూప్ లో చేరి నాటకాలు వేసేదాన్ని. అప్పుడే యాడ్స్ చేసే అవకాశం కూడా వచ్చింది. అటుపై సినిమా ప్రయత్నాలు మొదలు పెట్టాను. 'కోహినూర్' అనే మలయాళం సినిమాలో నటించే అవకాశం వచ్చింది. చిన్ననాటి నుంచి ఇంట్లో స్వేచ్ఛ ఇచ్చారు. సండే వస్తే అక్క.. నేను సినిమాకి వెళ్లేవాళ్లం. ఆ తర్వాత నా స్టోరీలకు నా స్నేహితులు బలైపో యేవారు. పదో తరగతిలో ఉన్నప్పుడు సినిమాల్లోకి వెళ్లొచ్చుగా అని చెప్పేవారు. బహుశా వాళ్లంతా అలా ప్రోత్సహించడం వల్లే ఇంతవరకూ రాగలిగానేమో' అనిపిస్తుంది అన్నారు. ప్రస్తుతం ఈ భామ నటిస్తోన్న 'సైంధవ్' సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకొస్తుంది. అలాగే అమ్మడి చేతిలో మరికొన్ని ప్రాజెక్ట్ లు ఉన్నాయి.



# ఈ తీర్పు ఆశాకిరణం

న్యూఢిల్లీ: ఆర్టికల్ 370 రద్దుని సమర్థిస్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మకమైన తీర్పుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. జమ్మూకాశ్మీర్, లద్దాఖ్ ప్రజల ఐక్యత, పురోగమనం, దృఢవిశ్వాసం కోసం సుప్రీంకోర్టు సుస్పష్టమైన ప్రకటన చేసిందని వ్యాఖ్యానించారు.

ఆర్టికల్ 370 రద్దు వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను త్రోసిపుచ్చుతూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన కొద్దిసేపటికే 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. " ఆర్టికల్ 370 రద్దుపై ఈ రోజు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైనది. 5 ఆగస్టు 2019న భారత పార్లమెంట్ తీసుకున్న నిర్ణయాన్ని సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది" అని పోస్ట్ చేశారు. దృఢమైన విశ్వాసం కలిగిన జమ్మూ, కాశ్మీర్, లడఖ్ ప్రజల కలలను సాకారానికి నిబద్ధతతో ఉన్నామని ప్రధాని హామీ ఇచ్చారు. ప్రగతి ఫలాలను సాధారణ ప్రజలతోపాటు సమాజంలో అత్యంత బలహీన, అట్టడుగు వర్గాలకు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆర్టికల్ 370 కారణంగా నష్టపోయిన సమాజానికి అభివృద్ధి ఫలాలను అందజేస్తామని అన్నారు.

సుప్రీంకోర్ట్ ఇచ్చిన తీర్పు కేవలం చట్టపరమైన తీర్పు కాదని, ఇదొక ఒక ఆశాకిరణంగా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఉజ్వల భవిష్యత్తుకు వాగ్దానమని, ఉమ్మడి భారతదేశాన్ని నిర్మించాలనే సమిష్టి సంకల్పానికి నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు.



# జైవీర్‌కు పదవి ఇవ్వాలని అడగలేదు

హైదరాబాద్: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కె.జానారెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంను జానారెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. దాదాపు గంటసేపు వీరిద్దరూ వివిధ అంశాలపై చర్చించుకున్నారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా జానారెడ్డి ఇంటికి వెళ్లి ఆయన్ను కలిశారు. అనంతరం జానారెడ్డి మీడియాతో మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజాభిమానం సొంతం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించానని తెలిపారు. "సీఎం, మంత్రులు ఐకమత్యంతో పనిచేయాలి. నేను ప్రభుత్వంలో భాగస్వామిని కాను.. అంత అవసరం లేదు. ప్రజలు ఇచ్చిన ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని వారికి సూచించా. మాజీ సీఎం కేసీఆర్‌కు గాయం కావడం బాధాకరం. నేను ఆయన్ను పరామర్శించా. కేసీఆర్ త్వరగా కోలుకోవాలి. ప్రతిపక్ష నాయకుడిగా ఆయన తన సూచనలు ఇవ్వాలి.

**పార్టీ ఆదేశిస్తే పోటీ చేస్తా :** నల్గొండ పార్లమెంట్‌కి పోటీ చేస్తా అని గతంలో అన్నాను. పార్టీ ఆదేశిస్తే పోటీ చేస్తాను. ఉమ్మడి రాష్ట్రంలో 15 ఏళ్లు మంత్రిగా ఉన్నా. నా కుమారుడు జైవీర్‌కు పదవి ఇవ్వాలని అడగలేదు. ప్రస్తుతం అతడు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన ఇంకా జూనియర్.. ఇప్పుడే పదవులు అడగలేం. ఇవ్వడం కూడా సమంజసం కాదు" అని జానారెడ్డి అన్నారు.



# సీఎం రేవంత్‌కు మల్లారెడ్డి ఒక విన్నపం

హైదరాబాద్:మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు మాజీ మంత్రి మల్లారెడ్డి చెప్పారు. యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను సోమవారం మల్లారెడ్డి పరామర్శించారు. కేటీఆర్‌ను కలిసి కేసీఆర్ ఆరోగ్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. 'ఇంకా రెండుమూడు రోజులు తర్వాత కేసీఆర్ డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంది. కళ్లల్లో వత్తులు వేసుకుని మరీ కేసీఆర్ తెలంగాణను ఒక మోడల్‌గా తయారు చేశారు. కేటీఆర్ లేని హైదరాబాద్‌ను ఐటీ ఉద్యోగులు చూడలేకపోతున్నారు' అని మల్లారెడ్డి అన్నారు. 'రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో అన్ని సదుపాయాలు మెరుగుపడ్డాయి.లోకల్‌గా ఎమ్మెల్యే కి ఓటు వెయ్యకూడదని ప్రజలు అనుకున్నారు కానీ సీఎంగా కేసీఆర్ ఉండరని వారు అనుకోలేదు. కేసీఆర్ సీఎంగా లేనందుకు ఇప్పుడు అందరూ బాధపడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఓకే ఒక్క విజ్ఞప్తి చేస్తున్నా.

రాష్ట్రంలో ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాలను కాపాడాలని కోరుతున్నా' అని మల్లారెడ్డి చెప్పారు.



# కేసీఆర్‌ని పరామర్శించిన ప్రకాష్ రాజ్, బీఆర్ఎస్ కీలక నేతలు

హైదరాబాద్ : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పరామర్శించేందుకు ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ యశోద ఆసుపత్రికి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి పరామర్శించారు. కేసీఆర్ గారి ఆరోగ్యపరిస్థితి గురించి ఆరా తీశారు. కోలుకుంటున్న విషయం తెలుసుకున్నారు. అక్కడే ఉన్న ఎమ్మెల్సీ కవితను సైతం ప్రకాష్ రాజ్ పరామర్శించారు. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, మల్లారెడ్డి, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ లు మధుసూదన చారి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి మోత్కుపల్లి, చల్మడ లక్ష్మి నరసింహారావు తదితరులు కూడా కేసీఆర్ ఆరోగ్యపరిస్థితి గురించి తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# ఎప్పటికీ ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటా..



సిద్దిపేట: అనేక బాధ్యతల ద్వారా ఎదిగానని.. ఎప్పటికీ ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. మనముందు ఉన్న కర్తవ్యం పెద్దది అని.. గత పాలకుల తీరు నచ్చక కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారన్నారు. ఆరు గ్యారంటీల్లో రెండు అమలు చేస్తున్నామని చెప్పారు. ఆచరణలో లోపాలను ప్రతి 15 రోజులకోసారి సమీక్షించుకుని ముందుకు వెళతామన్నారు. రోజు 45 లక్షల మందిని, 35 లక్షల కిలోమీటర్లు ఆర్టీసీ తిరుగుతుందని తెలిపారు. ఆర్టీసీని మరింత ప్రజలకు చేరువ చేస్తామన్నారు. జిల్లా అభివృద్ధి విషయంలో మంత్రిగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా బాధ్యత తీసుకుంటానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం మన భాద్యతగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. వంద రోజుల కాలంలో ఆరు గ్యారంటీ లను అమలు చేస్తామని స్పష్టం చేశారు. పార్టీలకతీతంగా పని చేస్తామన్నారు. సమస్య ఉంటే పార్టీ ఏదైనా తమ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. నియంతృత్వం తమ విధానం కాదన్నారు. గూగుల్ మ్యాప్‌లు నీళ్ళల్లోకి తీసుకుపోతున్నాయని.. గూగుల్‌కు లెటర్ రాయాలని కలెక్టర్‌కు ఆదేశించానన్నారు. గౌరవెల్లి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయమని చెప్పానన్నారు. బీసీ బంధులో అవకతవకలపై సమీక్ష జరుపతామన్నారు. విద్యుత్ శాఖకు మాత్రమే 85 వేల కోట్ల అప్పు ఉందని తెలుస్తోందన్నారు. గత ప్రభుత్వం రైతు బంధు ఎప్పుడూ డిసెంబర్ చివరి వారంలో ఇచ్చిందని.. ఖచ్చితంగా రైతులకు రైతు బంధు ఇస్తామన్నారు. ప్రతి శాఖకు సంబంధించి వైట్ పేపర్ రిలీజ్ చేస్తామన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, సంస్థ మనుగడ కోసం కృషి చేస్తామన్నారు. పార్టీ శ్రేణులు, పోటీ చేసిన అభ్యర్థుల ఆధ్వర్యంలోనే పార్టీ కార్యక్రమాలు జరుగుతాయని.. వర్గాలకు, విభేదాలకు తావివ్వద్దని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.



# మేడిగడ్డను ఎవరు నిర్మించినా.. జరిగిన ఘటనకు బాధ్యత వహించాల్సిందే

హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ సందర్శనకు ఏర్పాట్లు చేయాలని నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. మేడిగడ్డలో బ్యారేజీలో పిల్లర్ కుంగడం చాలా తీవ్రమైన అంశమన్నారు. మేడిగడ్డ నిర్మాణం చేపట్టిన సంస్థను, అధికారులను పర్యటనలో తన వెంట ఉండేలా చూడాలన్నారు. నీటి పారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి జలసౌధలో ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. పెండింగ్, ఇతర ప్రాజెక్టుల పరిస్థితిపై ఆరా తీశారు. ప్రాజెక్టుల గురించి మంత్రికి ఈఎన్‌సీ మురళీధర్‌రావు వివరించారు. అలాగే ఇటీవల మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ కుంగడంపై అధికారులు వివరణ ఇచ్చారు. "మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణానికి రూ.4600 కోట్లు ఖర్చు చేశాం. అందులోని ఒక పిల్లర్ 1.2 మీటర్లు కుంగడంతో.. మరో మూడు పిల్లర్లపై ఆ ప్రభావం పడింది. ముందురోజు సాయంత్రం పిల్లర్ కుంగిన వెంటనే ప్రాజెక్టులో నీటిని తోడేశాం. నీటిని తోడిన తర్వాత పిల్లర్ కుంగడం తగ్గింది" అని అధికారులు చెప్పారు. అధికారుల వివరణ తర్వాత స్పందించిన మంత్రి ఉత్తమ్.. ఇది చాలా తీవ్రమైన అంశమని, ప్రాజెక్టు సందర్శనకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. "అక్కడ ఖర్చు చేసిందెంత?ఎంత ఆయకట్టుకు నీరిచ్చేందుకు నిర్మాణం జరిగింది?ఒక్కో ఎకరా సాగుకు అవుతున్న ఖర్చెంత?" అని అధికారులను మంత్రి ప్రశ్నించారు.

# 'రేవంత్ అన్నా'.. అంటూ మహిళ పిలవగానే.. వీడియో వైరల్



హైదరాబాద్: "మేం పాలకులం కాదు.. సేవకులం" అంటూ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు చెప్పిన వ్యాఖ్యలను రేవంత్ రెడ్డి అక్షరాలా నిజం చేస్తున్నారు. అందుకు ఇప్పుడు మీరు చూడబోయే ఈ వీడియోనే సాక్ష్యంగా నిలిచింది. ముఖ్యమంత్రి ప్రజల మనిషి అని ఈ ఒక్క వీడియోతో చెప్పేయొచ్చు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు సంచలనంగా మారుతున్నాయి. ఇప్పుడు తాజాగా ఓ మహిళ పిలుపుకు ముఖ్యమంత్రి ప్రవర్తించిన తీరుపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. "రేవంత్ అన్నా.. మీతో మాట్లాడాలి" అంటూ ఓ మహిళ పిలవగానే సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించారు. ఈ ఘటన సోమాజీగూడ యశోదా ఆస్పత్రిలో చోటు చేసుకుంది. తుంటి ఎముక ఫ్యాక్చర్‌తో యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పరామర్శించేందుకు ఆదివారం సీఎం రేవంత్ ఆస్పత్రికి వెళ్లారు. కేసీఆర్‌ను పరామర్శించి తిరిగి వెళ్తుండగా రేవంత్ అన్నా అంటూ ఓ మహిళ పిలిచింది. మహిళ పిలిచిన వెంటనే స్పందించిన సీఎం.. ఆమె దగ్గరికి వెళ్లి సమస్య ఏంటో చెప్పమని అడిగారు. దీంతో తన పాపకు ఆస్పత్రి ఖర్చు చాలా అవుతోందని, సాయం చేయాలని మహిళ కోరింది. వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సామాన్యులు పిలవగానే పలికిన సీఎం రేవంత్ వ్యక్తిత్వంపై నెటిజన్లు ఫిదా అవుతున్నారు. సీఎం అంటే ఇలా ఉండాలి అంటూ నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేయలే: గుత్తా సుఖేందర్ రెడ్డి



నల్లగొండ: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పట్ల ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదని, ప్రేమ, విశ్వాసం అలాగే ఉన్నాయని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు నమ్మి ప్రజలు ఓట్లు వేశారని అనుకోవడం లేదని చెప్పారు. కేసీఆర్ రావాలి–మా ఎమ్మెల్యేలు పోవాలని ఓటర్లు అనుకున్నట్లు ఉందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కేటీఆర్ పనితీరుకు ఓట్లు పడ్డాయని తెలిపారు. నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరుగుతుందన్నారు. పార్టీ మారాల్సిన అవసరం తనకు లేదని స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధమైన శాసన మండలి చైర్మన్ పదవీలో ఉన్నానని, తనకు ఏ పార్టీతో సంబంధం లేదని చెప్పారు. చట్టబద్ధంగా కర్తవ్యాన్ని నిర్వహిస్తానని, ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం ఉందని తెలిపారు. ప్రభుత్వానికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కూడా సాధ్య అసాధ్యలను బేరీజు వేసుకోవాలని సూచించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితి వివరించి పథకాలు అమలు చేయాలని, వాస్తవాలు చెబితే ప్రజలు తప్పకుండా అర్థం చేసుకుంటారిన చెప్పారు.

బీఆర్ఎస్ అధిష్టానం కూడా ప్రజలు తమకు వ్యతిరేకంగా తీర్పు ఎందుకిచ్చారని విశ్లేషన చేసుకుంటున్నదని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని, అధికారం ఎవరికీ శాశ్వతంగా ఉండదని వెల్లడించారు. మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలను పేపర్లలో చూశానని, విమర్శలకు, ప్రతి విమర్శలకు ఇప్పుడు సమయం కాదన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేస్తూ, పక్కా కార్యాచరణతో వాళ్ళు పనిచేసుకుంటు వెళ్లాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రెండు మంత్రి పదవులు రావడం సంతోషంగా ఉందని చెప్పారు. ఇద్దరు మంత్రులు జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జిల్లాలో ఇరిగేషన్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వాటిపై దృష్టిపెట్టాలన్నారు. జిల్లాలో రహదారుల అభివృద్ధికి మంత్రి వెంకట్ రెడ్డి పని చేస్తారనే నమ్మకం ఉందని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా బయటకు రావాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాని తెలిపారు.

# సాగు చేసే వారికే రైతుబంధు: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సారంగాపూర్ : సాగుచేసే నిజమైన రైతులకే పెట్టుబడి సాయం(రైతు బంధు) అందించేలా ప్రభుత్వం సమీక్ష నిర్వహించి డిసెంబరు చివరిలోగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేయనుందని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. సారంగాపూర్ మండలంలోని రేచపల్లిలో ఆర్టీసీ బస్సు సేవలను ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ధరణిలో తప్పొప్పులను పరిశీలించి, కొంత మంది భూస్వాములు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వందల ఎకరాలు సాగు భూములుగా చూపిస్తూ రైతు బంధు సాయం పొందుతున్నారని, దీనిపై పునరాలోచించి సాగు చేసే భూములకు హామీ ఇచ్చిన విధంగా ప్రతి ఎకరాకు రూ.7500 చొప్పున సాయం అందించేలా చూస్తామన్నారు. గత ప్రభుత్వం ఖాళీ ఖజానా ఇచ్చిందని అయినప్పటికీ కేవలం ఆరు గ్యారంటీలే కాకుండా ప్రజా సంక్షేమ పథకాలను ఎక్కడా ఆపేదిలేదని పేర్కొన్నారు. భూక్య సరళ, కోండ్ర రాంచందర్‌రెడ్డి, ఎం.ఇబ్రహీం, మోత్కూరి ప్రసాద్, అసాది రాజం, తిరుపతిరెడ్డి, ఆనంద్‌రెడ్డి, అసాది హరీష్, బేర మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో పెరిగిన భక్తులరద్దీ..

యాదాద్రి: పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొంది. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో భక్తులరద్దీ పెరిగింది. స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ధర్మ దర్శనానికి మూడు గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి గంట సమయం పడుతోంది. కాగా కార్తీకమాసం ముగుస్తుండటం, నిన్న (ఆదివారం) సెలవు రోజుతో పాటు స్వాతి నక్షత్రం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి నృసింహుడిని దర్శించుకున్నారు. స్వామివారి ధర్మ దర్శనానికి ఐదు గంటలు, ప్రత్యేక దర్శనానికి 3 గంటల సమయం పట్టింది. సుమారు 60 వేలకు పైగా భక్తులు ఇష్టదైవాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. ఒక్కరోజే 1,594 మంది దంపతులు సత్యనారాయణస్వామి వ్రతపూజల్లో పాల్గొన్నారు. స్వామి జన్మనక్షత్రం పురస్కరించుకుని స్వాతి జన్మనక్షత్రోత్సవాలు పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి.

హోమ పూజలు చేపట్టి గర్భాలయంలో కొలువుదీరిన మూలవర్యులను వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ అష్టోత్తర శత కలశాలతో అభిషేకించారు. అనంతరం ప్రాకార మండపంలో లక్ష్మీనృసింహుల తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిసి అధిక సంఖ్యలో వెళ్లాల్సిరావడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. యాదాద్రీశుడిని ఏపీ రవాణ, సమాచారశాఖ మంత్రి విశ్వరూప్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఇక ఆలయ ఖజానాకు ఒక్కరోజే రూ.1.09 కోట్ల ఆదాయం సమకూరింది. వీఐపీ బ్రేక్ దర్శనాలు, ఆర్జిత సేవలు, వాహనాల ప్రవేశాలు, ప్రసాద విక్రయాలు, ఇతర విభాగాల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయాన్ని ఆలయ ఖజానాలో జమ చేసినట్లు అధికారులు తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com